జనరాజకీయం కోసం...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 2 సంచిక - 24 పక్షపత్రిక డిసెంబరు 16-31, 2011

## రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులు అపోహాలు - వాస్తవాలు








హైదరాబాద్‌లో 26వ పుస్తక ప్రదర్శనలో లోక్‌సత్తా సాహిత్యం పుస్తక విక్రయకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన కార్యదర్శి జి. రాజారెడ్డి, పబ్లికేషన్స్ ఇంచార్జ్ బండారు రామ్మోహన్‌రావు తదితరులు






రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై ప్రజలతో సంతకాల సేకరించి గాంధీజీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన లోక్‌సత్తా కార్యకర్తలు



గుంటూరులో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా...




చిలకలూరిపేటలో రోడ్డు ప్రమాదాల నివారణకు మానవహక్కుల కమీషన్‌కు లేఖ అందించిన లోక్‌సత్తా నాయకులు




తణుకు మున్సిపల్ శిక్షణ క్షేత్రపర్యటనలో పాల్గొన్న నాయకులు



విజయనగరంలో చెరకు మద్దతు ధర పెంచాలని ధర్నా చేస్తున్న లోక్‌సత్తా, టీడీపీ నాయకులు

జన రాజకీయం కోసం...
లోక్‌సత్తా టైమ్స్
పక్షపత్రిక డిశంబరు16-31,2011
సంపుటి - 2 సంచిక - 24

## లోపలి పేజీల్లో...

రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులు............. 5
ప్రాతినిధ్యత లోపిస్తున్న ప్రజాస్వామ్యం........... 8
కొత్త విజ్ఞానాన్ని సృష్టించేదే విద్య.................. 11
పౌర సమాజం ఉద్యమించాలి.................... 13
చెరకుకు సలహా ధర ప్రకటించాలి.............. 17
లోక్‌పాల్ బిల్లుపై పసలేని నివేదిక................ 18
లోక్‌సత్తా పార్టీ మీడియాలో కవరేజి............ 22
రష్యాలో స్వయం ప్రతిపత్తి లేని ఎన్నికల కమీషన్.25
రష్యాలో ప్రజాస్వామ్య సంస్కరణల ఉద్యమం.... 27
మంచినీటి సరఫరాలో వివక్ష...................... 29
జిల్లాల సమాచారం................................. 31

సంపాదకవర్గం
డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు
డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు
సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు
బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
డి.టి.పి : జ్యోతి తాటి
ఫోటోలు : ఎన్. సంజీవ్ కుమార్

# పడకేస్తున్న ప్రాథమిక విద్య

## సంపాదకీయం

రాష్ట్రంలో ప్రాథమిక విద్య పడకేస్తున్న తీరుకు పాఠశాలల్లో చేరుతున్న పిల్లల సంఖ్య అద్దం పడుతున్నది. రాష్ట్రంలో దాదాపు 54 వేల ప్రాథమిక పాఠశాలలో 15 వేల పాఠశాలలో 25 మంది కంటే తక్కువ మంది పిల్లలున్నారు. 100 మందిలోపు పిల్లలతో పాఠశాలలు నడిచిపోతున్నాయి. కొన్ని చోట్ల పిల్లల సంఖ్యకంటే ఉపాధ్యాయుల సంఖ్య అధికం అన్న వార్తలు వస్తున్నాయి. అయినా నేషనలైజ్ చేసే సంకల్పాన్ని ప్రభుత్వం ప్రదర్శించడం లేదు.

పాఠశాల విద్యమీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ కేటాయింపులు పెరుగుతున్నాయి. కొత్త బిల్డింగులు, రూములు వస్తున్నాయి. ఉపాధ్యాయులు, విద్యావలంటీర్లు పెరుగుతున్నారు. కాని ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య తరుగుతున్నదేగాని పెరగడం లేదు. ఈ పాఠశాలల్లో చేరిన పిల్లలకి చదువు పెరగడం లేదు.

ఇదే కాలంలో ప్రయివేటు విద్య ఉరకలు, పరుగుల మీద పెరుగుతున్నది. అక్కడ ఫీజులు పెరుగుతున్నాయి. ఆకర్షణలు పెరుగుతున్నాయి. గతంలో పట్టణాలకే పరిమితమైన ప్రయివేటు విద్య ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. ప్రయివేటు ఆటోలు, బస్సులతో పిల్లల్ని చేరవేస్తూ పిల్లల సంఖ్యని పెంచుకుంటున్నాయి. ఇన్ని హంగులున్నప్పటికీ ఇక్కడ కూడా మంచి ప్రమాణాల చదువు వస్తుందన్న దాఖలాలు లేవు. కాని తల్లిదండ్రులకు అ విశ్వాసాన్ని కలిగిస్తున్నాయి. ఆ నమ్మకాన్ని అవి సొమ్ము చేసుకుంటున్నాయి.

గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు ఈ రాష్ట్రాన్ని పాలించాయి. ఊరి బడి మీద ఖర్చులు పెంచామని చెప్పకోవడమే తప్ప దానిని చదువుల బడిగా మార్చడానికి ఏ ప్రభుత్వమూ పూనుకోలేదు. విద్య, ఆరోగ్యం, ఉపాధి మానవాభివృద్ధికి కీలకం అన్నది ఈ పార్టీలకు రాజకీయం కాకుండా పోయింది. అందుకే ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా పాఠశాల విద్య పట్ల ఉదాశీనతే కొనసాగుతున్నది.

పాఠశాల విద్యను ఇప్పటికైనా సమూలంగా సంస్కరించాలి. బోధన పద్ధతి మార్చాలి. ఏదో ఒక తరహా పరీక్షలుండాలి - ఇంగ్లీషు బోధన జరగాలి. పాఠశాలల ఆజమాయిషీకి అటు స్థానిక ప్రభుత్వాలకి అధికారాలు ఇటు బలమైన యంత్రాంగం వుండాలి. అన్నింటికీ మించి పాఠశాలలో పిల్లల సంఖ్యకీ, ఫలితాలకీ, ఉపాధ్యాయుల జీతభత్యాలకి మధ్య ప్రోత్సాహకాలుండాలి. ఇవి జరగకపోతే సర్కారీ విద్యకు పోస్తున్న ప్రజాధనం పూర్తిగా దండగా అవుతోంది. ■

# 2012 నూతన సంవత్సర శుభాకాంక్షలు

## లోక్‌సత్తా టైమ్స్ పాఠకులకు, ప్రకటనకర్తలకు, లోక్‌సత్తా పార్టీ అభిమానులకు, కార్యకర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



### రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
8-2-674బి/2/9, ప్లాట్ నం : 93
హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,
బంజారాహిల్స్, హైదరాబాద్ – 500 034

**ఫోన్ నంబర్లు :**
**23311819, 23311817**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 23310612**
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

### చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: 040-2323 1818.*
*సెల్ : 80085 07934*

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

### లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులు అపోహలు - వాస్తవాలు

## లాభసాటి వ్యవసాయానికి ఎఫ్‌డీఐలు

***దుర్బలమైన నేతల ఏలుబడిలో అన్నదాతకు అన్ని వైపులా కష్టాలేనన్నది మరోసారి రుజువైంది. అన్ని రాజకీయ పార్టీలు ఎంతగా ఊరించినా, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర అందని ద్రాక్షగానే మారింది. ప్రతిసారీ కన్నెర్రచేసే ప్రకృతిదీ అదే దారి. విదేశీ పెట్టుబడుల సహకారంతోనైనా గండం గట్టెక్కాలనుకున్న రైతున్నకు, అక్కడా నిరాశే ఎదురైంది. దేశంలో అన్ని రకాల పరిశ్రమల అభివృద్ధికీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నిరాటంకంగా ఆహ్వానించే రాజకీయ పార్టీలు రైతులను ఆదుకునే 'విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల' (ఎఫ్‌డీఐ) విషయంలో మాత్రం మోకాలడ్డటం విచారకరం.***

వివిధ రైతు సంఘాలు, ఎందరో మేధావులు ఈ విషయంలో మద్ధతు ప్రకటించినా రైతుకు ఫలితం దక్కకపోవడం, పాలక-ప్రతిపక్ష రాజకీయపార్టీల కుటిలత్వమేనని చెప్పక తప్పదు. ముఖ్యంగా, పార్లమెంటులో ప్రధాన ప్రతిపక్షమైన భారతీయ జనతాపార్టీకూడా దళారుల కొమ్ముకాస్తున్నట్టు ఈ ఉదంతం నిరూపించింది. విపక్షాల వితండవాదనలతో వెనుకంజ వేసిన ప్రభుత్వం రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులను అనుమతించే ప్రతిపాదనలను ఆగమేఘాల మీద ఉపసంహరించు కుంటున్నట్టు ప్రకటించింది. ప్రతిపక్షాల సంకుచిత రాజకీయ ఎత్తుగడల ముందు మోకరిల్లిన ప్రభుత్వం, అన్నదాతకు చేరువైన బృహత్తర అవకాశాన్ని నిరాకరించడం విజ్ఞతతో కూడిన చర్చ అనిపించుకోదు.

ప్రకృతి ప్రసాదించిన ఎన్నో రకాల పంటలతో భౌగోళికంగా మన దేశం ముందు వరుసలో ఉన్నప్పటికీ, లోపభూయిష్టమైన సేకరణ, ప్రాసెసింగ్ పద్ధతుల వలన పండించిన దానిలో సింహభాగాన్ని రైతు నష్టపోక తప్పడం లేదు. ప్రతి ఏడూ దిగుబడిలో 70 శాతం పైగా పండ్లు, కూరగాయలు వినియోగానికి నోచుకోకుండానే కుళ్లిపోతున్నాయన్నది ఒక అంచనా. అభివృద్ధి చెందిన దేశాల్లో వినియోగదారులు చెల్లించే మూల్యంలో 50 నుంచి 70 శాతం రైతు చేతికి దక్కుతుంటే, మన దేశంలో అది 30శాతం కన్నా తక్కువ స్థాయిలో ఉండటం తీవ్రమైన విషయం. కారణాలు ఏమైనా, మన వ్యవసాయ సాగు విధానాలు అభివృద్ధి చెందిన, చెందుతున్న ఇరుగుపొరుగు దేశాలతో పోల్చుకుంటే చాలా వెనుకబడి ఉన్నాయనే చెప్పాలి.

బ్యాంకులు మొదలు ప్రభుత్వం అందించే ఎలాంటి సహాయమూ చిన్న, సన్నకారు రైతులకు అందకపోవడంతో, ఈ రోజుకీ స్థానిక వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడక తప్పనిస్థితి గుత్తేదారులు, కొనుగోలుదారులు, స్థానిక రాజకీయ నేతల మధ్య రైతు నిత్యం నలిగిపోతున్నాడన్నది. అతిశయోక్తి కాదు. ఫలితంగా రైతులు మాత్రమే పేదరికంలో మగ్గిపోతున్నారు. అయితే,



క్షేత్రస్థాయిలో ఏజెంట్లు, టోకు వ్యాపారుల దరిదాపులకు కూడా పేదరికం వెళ్లదు. ఈ పరిస్థితి ఇంకెంత కాలం కొనసాగాలి? అన్న రైతు ప్రశ్నకు జవాబు లేదు. ఇరవై ఏళ్ల క్రితం ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల నేపథ్యంలో, అనేక పేద దేశాలు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల సాయంతో ఆర్థికపరమైన వెనుకబాటును అధిగమించాయన్నది. గుర్తించక తప్పని అంశం. అమెరికా సైతం 2006లో బహుళ బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను అనుమతించడం విశేషం. అక్కడ ఏ రాజకీయ పక్షాలు విదేశీ పెట్టుబడులను వ్యతిరేకించలేదు. అభివృద్ధి చెందిన స్విట్జర్లాండ్, టర్కీ వంటి దేశాలు కూడా విదేశీ పెట్టుబడులతో లాభపడ్డాయన్నది మరువలేనిది.

తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన భారత వ్యవసాయ రంగానికి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఆశాకిరణం. 'వేల్యూ చైన్' విధానంలోని దీటైన నిర్వహణ ద్వారా ఒక పక్క ఉత్పత్తిదార్లు పొందే విలువ, మరోవైపు వినియోగదారుడ చెల్లించే ధరల మధ్య అంతరాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అనేక దేశాలు నిరూపించాయి. అయినా, కొన్ని రాజకీయ శక్తులు రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులకు మోకాలడ్డటం, ఈ దేశంలో వ్యవసాయ సంక్షోభాన్ని శాశ్వతంగా కొనసాగించడమే. ఈ పెట్టుబడులతో పెద్ద పెద్ద వ్యవస్థితమైన రిటైల్ వ్యాపార సంస్థలు లాభాలను తన్నుకుపోగలవనే భయాలను రెచ్చగొడుతూ, పరోక్షంగా రైతుకు జరిగే మేలును నిరాకరించడం దుర్మార్గమైనది. వాల్‌మార్ట్, టెస్కో వంటి బహుళ జాతి సంస్థలు మన దేశంలోని చిన్న చిన్న కిరాణా షాపుల వ్యాపారాలను నష్ట పరుస్తాయనటం నిజంకాదు. అనేక చిన్న రిటైల్ వ్యాపారాలు నష్టపోయే మాట అటుంచి, బహుళజాతి సంస్థలతో సమానంగా దీటైన వ్యాపారాలు నడిపిస్తున్న వైనం మన పొరుగు దేశమైన చైనాలో చూడవచ్చు.



**ఈ భయాందోళనలన్నీ రాజకీయ పక్షాలు వ్యక్తం చేస్తున్నవే తప్ప, వైవిధ్యభరితమైన అలవాట్లు కలిగిన వినియోగదారులున్న భారతదేశంలో చిన్న వ్యాపారాలకు ఎటువంటి నష్టం కలగదు. ప్రభుత్వం రూపొందించే నియమనిబంధనలను తు.చ. తప్పక అమలు చేసినట్లయితే, ప్రత్యక్ష పెట్టుబడులు వ్యవసాయరంగ అభివృద్ధికి ఇతోధికంగా దోహదం చేస్తాయన్నది వాస్తవం.** ప్రభుత్వ ఉదాశీనతతో పెట్టుబడులే కరువైన వ్యవసాయ రంగంలో ఆధునీకరణతో పాటు సరఫరా చైన్‌లో ఉన్న తీవ్ర నిర్వహణ లోపాలను అధిగమించవచ్చు. సాంప్రదాయకమైన వివిధ చారిత్రక కారణాలతో అనేక కట్టుబాట్లకు లోనైన రైతులు, తమ ఆందోళన వీడి ఆధునిక, వ్యాపార దృక్పథం కలిగిన వ్యవసాయానికి స్వాగతం పలకాలి.

బహుళజాతి సంస్థలు రిటైల్ వ్యాపారంపై గుత్తాధిపత్యం ఏర్పరచుకుని చిన్న రైతులను అణచివేస్తారని పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. బెంగాల్‌లోని హౌరా తదితర దక్షిణ జిల్లాల చిన్న రైతులు పెప్సికో బహుళజాతి సంస్థ నుంచి పొందుతున్న లాభాల నేపథ్యాన్ని గమనిస్తే, ఈ ప్రచారానికి అర్థంలేదు. పెప్సికోతో సంబంధమున్న సుమారు 6,500 మంది చిన్న రైతులు తమ ఉత్పత్తులకు ఊహించని రేటును పొందుతున్నారన్నది గమనార్హం. వృత్తి ధర్మాన్ని పాటిస్తూ, ఇరువర్గాలూ నియమాలను ఉల్లంఘించనంత వరకూ మంచి ఫలితాలను పొందగలరని నిస్సందేహంగా చెప్పవచ్చు. అలాగే, పంజాబ్ రైతుల అనుభవం కూడా గమనించదగ్గది. మాలేరుకోట్ల తహసీల్‌కు చెందిన ఏడు గ్రామాల రైతులు భారతి-వాల్ మార్ట్ బహుళజాతి సంస్థకి గత రెండుళ్లుగా 30 టన్నులకు పైగా ప్రతిరోజూ తమ కూరగాయ ఉత్పత్తులను సరఫరా చేస్తున్నారు. దీనికి సంబంధించిన లావాదేవీలు ప్రతి రైతుకూ ఇచ్చిన పాస్‌పోర్ట్‌లో ఆధునిక యాజమాన్య పద్ధతుల్లో పొందుపరుస్తారు. దీంతో

దళారీల మోసాల నుంచి విముక్తి లభించిందన్నది, ఆ గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం.



విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు వ్యతిరేకంగా రాజకీయ పార్టీలు గుడ్డిగా ప్రచారం చేయడం తగనిపని. ఇందులో ముఖ్యమైన అంశం, ఈ విదేశీ పెట్టుబడులు చిన్న రైతులను అణగదొక్కుతాయన్నది కేవలం అపోహ మాత్రమే. ఎటువంటి ఒడంబడికైనా ఇరు వర్గాల సమ్మతితోనే కొనసాగుతుంది. తక్కువ ధరలకు ఒప్పుకునేలా రైతులను ఒత్తిడి చేస్తారనడం కూడా వాస్తవ విరుద్ధం. ముందుగా అనుకున్న నిర్ణీత ధరను రైతుకు విధిగా చెల్లించడం జరుగుతుంది.

రిటైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను నిరశిస్తూ దేశవ్యాప్తంగా జరిగిన బంద్‌లో చిన్న వ్యాపారులు పాల్గనకపోవడమే కాక, సాంప్రదాయక వినయోగదారులు ఈ విధానం ద్వారా తమకు ఒనగూడే ప్రయోజనాలను కూడా విస్మరించి మిన్నకుండిపోయారు. ఉత్తర భారతంతోని అనేక రైతు సంఘాలు ఎట్టకేలకు తమ గళం విప్పి వాల్ మార్ట్, టెస్కో వంటి బహుళజాతి సంస్థల రాకను సమర్థించాయి. ఈ ఏడాది ఆరంభంలోనే భారత్ క్రిషిక్ సమాజ్, షేత్కారి సంఘటన, భారతీయ రైతు సంఘాల కన్సారిటయం, అఖిల భారత కూరగాయ రైతుల సంఘం వంటివి ముందుగానే ప్రభుత్వానికి తమ పూర్తి మద్దతును తెలిపాయి. రిటైల్ రంగం పేరుతో వివిధ వర్గాల మధ్య ఘర్షణ వాతావరణాన్ని నెలకొల్పడం మంచి పద్ధతి కాదు. భారత ఎగుమతి సంఘాల ఫెడరేషన్, భారత రైతు సమాఖ్య కాన్ఫెడరేషన్‌లు మల్టీబ్రాండ్ రిటైల్ రంగంలో 51 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను స్వాగతించాయి. వీటి ద్వారా రైతులకు లాభసాటి ఎగుమతులు గణనీయంగా పెరుగుతాయని ప్రకటించాయి.

మన రాష్ట్రంలోని కోనసీమలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో కనీవినీ ఎరుగని రీతిలో రైతులు ప్రకటించిన 'క్రాప్‌హాలిడే'కి ప్రధానమైన కారణం మార్కెటింగ్‌తో ముడిపడ్డ సమస్యలేనన్నది తెలిసిందే. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులతో మార్కెట్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికే అవకాశాలు మెరుగువుతాయి. అలాగే, ఆత్మహత్యలకు పాల్పడుతున్న చేతి వృత్తుల వారికి అంతర్జాతీయ మార్కెట్ లభించి, తద్వారా వారి ఆర్థిక స్థితిగతులు మెరుగుపడే అవకాశం పెరుగుతుంది.

అవకాశవాద రాజకీయాలు మన దేశంలో వినియోగదారులతో సహ అన్నదాతల గొంతును కూడా నొక్కేస్తున్నాయనడానికి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అడ్డుకున్న తీరు ఒక ఉదాహరణ మాత్రమే. ఇందులో ఇమిడి ఉన్న లాభనష్టాలను అంచనా వేసుకొని తమ గొంతు వినిపించే పరిస్థితి అక్షరాస్యత అంతంత మాత్రమే ఉన్న మన అన్నదాతకు లేదు. వినియోగదారులకు అలాంటి సామర్థ్యం ఉన్నా, ఎందుచేతనో వారు మౌనంగా ఉండిపోతున్నారు. వివిధ వ్యాపార, సంపన్న వర్గాల మధ్య ఉన్న ఐక్యత, మన దేశంలోని చిన్న, సన్నకారు, మధ్యతరగతి రైతాంగం మధ్యలేదన్నది తెలిసిందే.

అనాదిగా అన్నదాతను దోచుకుంటున్న దళారీ వ్యవస్థకు బాసటగా రాజకీయ కొమ్ము కాస్తోందనటానికి ఇదొక ప్రత్యక్ష నిదర్శనం. నిరక్షరాస్యులైన ప్రజలను మభ్యపచి, అధికారమే పరమావధిగా భావించే కొందరు రాజకీయ నాయకులు రిటైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అడ్డుకోవడం రైతన్నలకు గొడ్డలి పెట్టు వంటిది గత ఇరవై ఏళ్ళుగా సంస్కరణలు చేపట్టి ఆర్థికంగా మన కన్నా అనేక మెట్లు పైకెక్కిన చైనా వంటి దేశాల ప్రగతిని చూసైనా మన నేతలు గుణపాఠం నేర్చుకోవాలి. ■

**డా॥ బలిజేపల్లి శరత్‌బాబు**
ప్రధాన శాస్త్రవేత్త
నేషనల్ బ్యూరో ఆఫ్, ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్
హైదరాబాద్

(సాక్షి ప్రతిక సౌజన్యంతో...)

# ప్రాతినిధ్యత లోపిస్తున్న ప్రజాస్వామ్యం

- **శ్రీ హమీద్ అన్సారీ**
భారత ఉపరాష్ట్రపతి

మన ప్రజాస్వామ్యం మనకెన్నో పాఠాలు నేర్పింది. ప్రజాస్వామ్యంలో పాలకులే ప్రభువులు. ఈ పాలకులు ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజా ప్రతినిధులు. ప్రజలకు ప్రాతినిధ్యం వహించేవారే ప్రజా ప్రతినిధులు. భారతదేశంలో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం అమలులో వుంది. ఇప్పుడు మన దేశంలో ప్రజాస్వామ్యం ప్రాతినిధ్యత ఎలా సహజీవనం చేస్తున్నాయో వివరించేదే ఈ విశ్లేషణ. నిర్దేశించిన సంఖ్యను (మేజిక్ ఫిగర్)ను దాటడమే ప్రజా ప్రాతినిధ్యం అవుతుందా? ఈ ప్రశ్నల నేపథ్యంలో మన ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ 'ఎన్నికల సంస్కరణలు' అనే అంశంపై జాతీయస్థాయిలో జరిగిన సదస్సులో చేసిన ప్రసంగాన్ని పాఠకులకు అందిస్తున్నాం. కేరళలోని తిరువనంతపురంలో గల సి.అచ్చుతమీనన్ అధ్యయన కేంద్రం మరియు గ్రంథాలయం ఈ జాతీయస్థాయి సదస్సును నిర్వహించింది.

మన ప్రజాస్వామ్య లక్ష్యాలను మనం మరోసారి కూలంకుషంగా శాస్త్రీయంగా పునఃపరిశీలించుకోవలసిన తరుణం ఆసన్నమైంది. మన ప్రజాస్వామ్య మౌలిక భావనలను, నిర్వచనాలను, పరిధిని సమీక్షించుకుని పునః ప్రకటించుకోవసిన అవసరం మన ముందుంది. దీని వలన వాస్తవాలను సరిచూసుకోవడానికి వీలువుతుంది. 1967లో హన్నాఫిట్‌కిన్ 'ప్రజా ప్రాతినిధ్యం- రాజకీయ ప్రాతినిధ్యం' అనే అంశంపై ఒక సిద్ధాంత వ్యాసాన్ని వ్రాసి చర్చకు శ్రీకారం చుట్టారు. రాజకీయ పండితులు దీనిపై పెద్దఎత్తున చర్చను చేపట్టారు.

రాజకీయ ప్రాతినిధ్యం అంటే ప్రజలతో కుదుర్చుకున్న ఒక బహిరంగ ఒప్పందం. ఇది ఒక వ్యవస్థతో కుదుర్చుకున్న అంగీకారం. ఎదో ఒక అభ్యర్థి సాధించిన పనిని చూసి ప్రజలు అప్పగించే బాధ్యత కాదు. ప్రజాస్వామ్య అంతస్సూత్రాల నుండి వికసించిన ఒక కుసుమం ప్రజా ప్రాతినిధ్యం. ప్రైవేట్ ప్రాతినిధ్యం, ప్రజా ప్రాతినిధ్యం వేర్వేరు పార్శ్వాలు. ప్రజా ప్రాతినిధ్యంలో పరివర్తనకు అవకాశం ఉంటుంది. రాజకీయ ప్రాతినిధ్యం బహురూపాలను సంతరించుకుంటుంది. ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం, పారదర్శకత, విజయాలను వైఫల్యాలను సమీక్షించుకోవడం జరిగుతుంది.

13 డిసెంబర్ 1946న మన రాజ్యాంగసభలో జవహర్‌లాల్ నెహ్రూ మన రాజ్యాంగ గమ్యాలు- లక్ష్యాలు అనే అంశంపై ఒక తీర్మానం చేశారు. సార్వభౌమాధికార, సర్వసత్తాక, గణతంత్ర భారతదేశానికి దాని అంతర్భాగాలకు సంపూర్ణ నిరపేక్ష అధికారం ప్రజల నుండి మాత్రమే లభించిందని నెహ్రూ ఆ తీర్మానంలో స్పష్టం చేశారు.

భారతదేశ ప్రజలమైన మేము. ఈ దేశాన్ని సర్వసత్తాక, లౌకిక ప్రజాస్వామ్య దేశంగా ప్రకటించుకున్నామని పీఠికలో పొందుపర్చుకున్నాం. స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం ప్రజలకు అందివ్వగలమని మనం పీఠికలో స్పష్టం చేసుకున్నాం. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని ఎంచుకున్నాం. ఇది వయోజన ఓటింగ్ ద్వారా సమకూపి విధంగా రూపొందించుకున్నాం. ఇవి ప్రజాస్వామ్యానికి పునాదిరాళ్లు. ఇవి ముఖ్యంగా నాలుగు అంశాలపై ఆధారపడి ఉంటాయి.

1. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు అనేది మన రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో ఒక అంతర్భాగం. ప్రజలు, ప్రతినిధులను ఎన్నుకోవడంలో చూపే విజ్ఞతపై ఇది ఆధారపడి ఉంటుంది.

2. మన దేశ పరిపాలన ప్రతినిధుల ద్వారా కార్యరూపం దాలుస్తుంది. పౌరులందరూ సమానస్థాయిలో తమ కోసం తాము నిర్ణయాలు తీసుకుంటారు.

3. ఎన్నికలు సకాలంలో జరగాలి. అలా కాకపోతే అది ప్రజాస్వామ్యం కాదు. ఈ ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రశాంతంగా, ప్రజాస్వామ్య స్ఫూర్తితో జరగాలి.

4. ప్రజాస్వామ్య ప్రభుత్వం ఏర్పాటు అనేది కేవలం ఒక అంకగణితపు విన్యాసం కానే కాదు. ఇది ప్రజలందరూ తమ ఆశలను, ఆశయాలను, ఆకాంక్షలను వాస్తవ రూపంలోకి తెచ్చుకునేందుకు చేసుకునే ఒక పవిత్ర ప్రయత్నం.

'ఎన్నికల సంస్కరణలు' అనే అంశంపై ప్రభుత్వ, ప్రభుత్వేతర వేదికలపై విస్తృతంగా చర్చ జరిగింది. చర్చల

తర్వాత లభించిన సారాన్ని నియమాలు, సూత్రాల రూపంలో రాజ్యాంగ చట్రంలోకి తెచ్చారు.

రాజ్యాంగ రచన చేసే సమయంలో రాజ్యాంగ నిర్మాతలు కొన్ని స్పష్టమైన ఎన్నికల విధానాలను అమలులో పెట్టారు. కేంద్ర, రాష్ట్ర శాసనసభలలోని దిగువ సభలకు వయోజన ఓటింగ్ విధానం ద్వారా రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎగువ సభలకు ఓటును బదలాయించే నైష్పత్తిక ప్రాతినిధ్య విధానాన్ని ఖరారు చేశారు.

8 ఆగస్టు1947న ప్రాతినిధ్యం అనే అంశంపై రాజ్యాంగ సభలో ఒక చర్చ జరిగింది. మైనారిటీల హక్కులపై జరుగుతున్న చర్చలో భాగంగా ఇది చర్చనీయాంశమైంది. సభలో ఒక సభ్యుడు మైనారిటీ హక్కుల నివేదికపై జరుగుతున్న చర్చలో భాగంగా ఒక సవరణ ప్రతిపాదన చేశారు.

షెడ్యూల్డ్ కులాల అభ్యర్థి ఎన్నికల్లో నెగ్గినట్టు ప్రకటించే ముందు ఆ అభ్యర్థి షెడ్యూల్డు కులాల ప్రజలు వేసిన ఓట్లలో కనీసం 35% ఓట్లు సాధించాలని ప్రతిపాదన చేశారు. షెడ్యూల్డు కులాలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వ ప్రతినిధి, ఆ ప్రజల మనోభావాలను ఆవిష్కరించగలిగే వ్యక్తిగా ఉండాలి.

రిజర్వ్‌డ్ నియోజకవర్గాలను మొత్తంగా రద్దు చేసి, బహుళ సభ్యుల నియోజకవర్గాలను ప్రారంభించాలనే చర్చ కూడా ఆ రోజు జరిగింది. నైష్పత్తిక ప్రాతినిధ్యం, వయోజన ఓటింగ్ ద్వారా సభ్యులను ఎన్నుకోవడం వెనుక గల ఆంతర్యాన్ని హేతుబద్ధతను డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇలా వివరించారు.

– నిరక్షరాస్యత ప్రబలంగా ఉన్న దేశంలో నైష్పత్తిక ప్రాతినిధ్యం అవసరం.

– ఎన్నికల అనంతరం కొన్నిసార్లు ప్రజాతీర్పు అస్పష్టంగా ఉంటుంది. ఇది స్థిరమైన ప్రభుత్వాన్ని అందించలేకపోతుంది. శాంతి భద్రతల సమస్య కూడా జటిలం అవుతుంది.

– వివిధ మైనారిటీ కమ్యూనిటీలకు, మెజారిటీ కమ్యూనిటీకి మధ్య జరిగే ఒప్పందం ఉల్లంఘనకు లోనవుతుంది.

జనవరి 1961లో ద్విసభ్య, త్రిసభ్య నియోజకవర్గాల చట్టాన్ని రద్దు చేశారు. 1952, 1957 సాధారణ ఎన్నికల్లో ఈ విధంగానే ఎన్నికలు జరిగాయి.

మన దేశంలో ఎన్నికల వ్యవస్థ స్వాతంత్ర్యం వచ్చిన తొలిదశాబ్దంలో ఎలా పనియేసిందో తెలుసుకుందాం. గడచిన అయిదు లోక్‌సభ సాధారణ ఎన్నికల్లో పోలైన ఓట్లలో 50 శాతం అంతకన్నా ఎక్కువ ఓట్లు సాధించిన వారి సంఖ్య 121 నుండి 221 మధ్య వుంది. 2009 సాధారణ ఎన్నికల్లో ఈ సంఖ్య 121 మాత్రమే. ఇంతకు ముందు వెంకటాచలయ్య కమిషన్ కూడా లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఎన్నికల్లో విజేతలు సాధించిన ఓట్ల సంఖ్యా వివరాలపై ఒక సమగ్ర అధ్యయనం చేసింది. లోక్‌సభ సభ్యుల్లో రెండింట మూడొ వంతు మంది, రాష్ట్రాల శాసనసభ్యుల్లో 90 శాతం మంది మైనారిటీ ఓటు మీదే విజేతలయ్యారని కమీషన్ తెలిపింది.

ఇక్కడ ఒక వైపరీత్యం మనకు కనిపిస్తుంది. ప్రజాస్వామ్యం ప్రాతినిధ్యం సహజీవనం చేస్తూనే, వాటి మధ్య ఉండవలసిన సంబంధం నానాటికీ మృగ్యమైపోతోంది. ఈ విచిత్రం మనకు బహు రూపాల్లో తారసపడుతుంది. ధృడంగా ఉండే వ్యవస్థీకృత రాజ్యాంగం, సరళంగా ఉండే రాజకీయ ప్రక్రియ ఒక దాంతో ఒకటి ఢీకొంటున్నాయి.

ఆరు దశాబ్దాల ఎన్నికలు తర్వాత మన ముందు అనేక ప్రశ్నలు ముసురుకొంటున్నాయి.

– ఎన్నికైన ప్రజాప్రతినిధికి ఉండే ప్రాతినిధ్యం మొత్తంలో ఎంత శాతం? మన వ్యవస్థ సంఖ్యాబలం కాన్న బహుళత్వం మీదే ఎక్కువగా పనిచేస్తోంది.

– ఇటీవల కాలంలో రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లోను, లోక్‌సభ ఎన్నికల్లోను ప్రజలు అస్పష్టమైన తీర్పును ఎందుకిస్తున్నారు. 1980 నుండి అస్థిర ప్రభుత్వాలు ఎందుకు ఏర్పడుతున్నాయి. వీటిని మనం ప్రాతినిధ్య ప్రజాస్వామ్యంలో భాగంగా పరిగణించగలమా?

– శాసనసభల్లో సాధించిన సీట్లు, లభించిన ఓట్ల మధ్య ఏదైనా అంకగణితం ఉంటోందా? మన ప్రజాప్రతినిధుల విశ్వసనీయత లేదా ప్రాతినిధ్యం నానాటికీ తరిగిపోవడం లేదా?

– ప్రభుత్వం, ఎన్నికల సంఘం, రాజకీయ పార్టీలు కలిసి నియోజవర్గాల్లో రెండు దశాలుగా ఎన్నికలు నిర్వహించే విధానంపై కసరత్తు చేసే సమయం ఇది కాదా? ప్రతి నియోజక వర్గంలోను సాధారణ అభ్యర్థుల మధ్య ఎన్నికలు నిర్వహించి, మరుసటి రోజు ప్రధాన అభ్యర్థుల మధ్య ఎన్నికలు జరిపితే ఎలా ఉంటుంది?

– ప్రస్తుత ఎన్నికల వ్యవస్థ దేన్ని సమర్థిస్తోంది? నువ్వెవరు? నువ్వెక్కడ ఉంటున్నావు? అనేదాన్నా లేక నువ్వు దేనిని నమ్ముతున్నావు, నువ్వు దేన్ని సాధించాలనుకొంటున్నావు?

– అల్పస్థాయి ప్రాతినిధ్యం సమస్యను ఎలా పరిష్కరించాలి. అల్పస్థాయి ప్రాతినిధ్యానికి, అధికారాన్ని చేజిక్కించుకొంటున్న వారికి మధ్య ఉండే గొలుసును ఎలా ఛేదించాలి? ముస్లిమ్‌లకు లభిస్తున్న అధికారం ఎంత శాతం ఓట్ల నుండి వస్తోంది? ఈ

వివరాలు చాలా గందరగోళంగా ఉన్నాయి.

– 84వ రాజ్యాంగ సవరణ ప్రకారం 2026 వరకు లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలోని సీట్ల సంఖ్యను పెంచేందుకు వీలు లేదు. ఈ పరిస్థితిలో ఒకే వ్యక్తి, ఒకే ఓటు, ఒకే విలువ ఆదర్శంతో ఈ పరిస్థితిని ఎలా అధిగమించగలం?

ప్రజాస్వామ్యంలో ఎన్నికల వ్యవస్థ పాత్ర ఎంతో ముఖ్యమైంది. ప్రజలు వేసిన ఓట్లను స్థానాల కింద మార్చి రాజకీయ అధికారానికి మార్గం సుగమం చేసేది ఎన్నికలే. ఇక్కడ విశ్వసనీయత, ప్రాతినిధ్యం అనేవి కీలక అంశాలు. ఇవి స్థిరమైన ప్రభుత్వాలను, సాంఘిక ఆర్థిక ప్రగతిని సాధించగలవు.

ఎన్నికల వ్యవస్థ ప్రభావం రాజకీయ పార్టీలపై కూడా ఉంటోంది. ఈ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఎన్నికలు ప్రోత్సహించగలవు. అణచివేయగలవు. ఎన్నికల వ్యవస్థ రాజకీయ శ్రేణులను సమీకరించగలవు. కూటములను ఏర్పాటు చేయగలవు. సమాజంలో తమకంటూ ఒక స్థానాన్ని కూడా పదిలపర్చుకోగలవు. సమాజంలో సామాజిక విభేదాలను రగల్చగలవు లేదా వివాదాలను యుక్తిగా పరిష్కరించగలవు.

గడచిన ఆరు దశాబ్దాల కాలంలో మనం ఎన్నికల వ్యవస్థ నుండి నేర్చుకున్న తీపి, చేదు అనుభవాలను సమీక్షించుకోవలసిన అవసరం ఉంది.

ఎన్నికల సంస్కరణలపైన, ఎన్నికల వ్యవస్థపైన జరిగే చర్చ భిన్న కోణాల్లో వాస్తవాలను స్పృశించాలి. ఇది ప్రాతినిధ్యతను పెంచాలి. అన్ని వర్గాలకు సముచిత రీతిలో స్థానం లభించే విధంగా ఉండాలి. రాజ్యాంగపరంగా రక్షణ ఉండేలా ఉండాలి. ముఠాలు, వర్గాల నుండి రక్షణ పొందేలా కూడా ఉండాలి. ఈ వ్యవస్థ జవాబు దారీతనంతో స్థిరమైన, సమర్థమైన పరిపాలనను అందించేందుకు దోహదపడాలి. పార్టీల్లో కూడా అంతర్గత ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందేలా, అందుకు అనుగుణంగా ఉండాలి.

ఎన్నికల సంస్కరణలు చట్టసభల్లో ప్రవేశపెట్టి మాత్రమే సాధించుకునేవి కావు. మనం కూడా సంస్కరణలను శ్రీకారం చుట్టవచ్చు. దీనికి రాజకీయపరంగా కఠోరశ్రమ, వ్యక్తిగత పరివర్తన అవసరం. అయితే ప్రస్తుతం మనకున్న రాజకీయ పార్టీలు అంతకఠోరశ్రమకు , వ్యక్తిగత పరివర్తనకు సంసిద్ధులుగా ఉన్నారా? ■

# హైదరాబాద్ 26వ పుస్తక ప్రదర్శన - లోక్‌సత్తా పుస్తక విక్రయ కేంద్రం ప్రారంభం

హైదరాబాద్ నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో డిశంబర్ 15న హైదరాబాద్ 26వ పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. రాష్ట్ర మంత్రి మాణిక్యవరప్రసాద్ ఈ ప్రదర్శనను ప్రారంభించారు. లోక్‌సత్తా పార్టీ సాహిత్యాన్ని అమ్మడానికి ఈ ప్రదర్శనలో ఒక పుస్తక విక్రయకేంద్రాన్ని ప్రారంభించింది. రాష్ట్రంలో ఒక రాజకీయ పార్టీ తన సాహిత్యాన్ని మాత్రమే అమ్మడానికి స్టాల్‌ను ప్రారంభించడం ఇదే మొదటిసారి. ఈ పుస్తక విక్రయకేంద్రాన్ని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. రాజారెడ్డి ప్రారంభించారు.




రాజకీయమంటే తను నమ్మిన సిద్ధాంతాలను ప్రజలకి అర్థమయ్యేలా వివరించి ఆ వాదనకి ప్రజలను సమీకరించి మద్దతు కూడగట్టడానికి పార్టీ సాహిత్యం పనికొస్తుందని లోక్‌సత్తా పార్టీ ప్రచురణల విభాగం కన్వీనర్ బండారు రామ్మోహన్‌రావు అన్నారు. స్టాల్‌ను సందర్శించే వారి అడ్రస్‌లు, ఫోన్ నంబర్లు కూడా నమోదు చేసుకుంటున్నామని పార్టీ అభిమానులే కాకుండా పుస్తకప్రియులు విస్తృతంగా స్టాల్‌ను సందర్శిస్తున్నారని మీడియా ఇంచార్జీ సురేష్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో మహిళాసత్తా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సరోజాదేవి, కె. గీతామూర్తి, సర్వజన సత్తా నాయకులు ఈద చెన్నయ్య, పి.వి.రావు, రాష్ట్ర కార్యదర్శి వి. విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిదంబరరావు, గజానని, మంగళ, సాయిలు, శ్రీనివాస్ తదితర వలంటీర్లు పుస్తక విక్రయకేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

ప్రతిరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుండి రాత్రి తొమ్మిది వరకు ప్రదర్శన ఉంటుందని, సెలవు దినాలు, ప్రత్యేక రోజుల్లో మధ్యాహ్నం 12 గం॥ లకే ప్రదర్శన మొదలవుతుంది. దేశ విదేశాలకు చెందిన ప్రఖ్యాత ప్రచురణకర్తల స్టాల్స్‌తో కూడిన ఈ పుస్తక ప్రదర్శనలో సుమారు 250 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రదర్శనకు వచ్చేవారికి ప్రవేశ రుసుం 5/- రూపాయలు ఉందని నిర్వాహకులు తెలిపారు.

# కొత్త విజ్ఞానాన్ని సృష్టించేదే విద్య అనుకరించడం విద్య కాదు

- శివవిశ్వనాథన్
సామాజిక శాస్త్రవేత్త

మీ దృష్టిలో ముఖ్యమైన మూడు మంత్రిత్వశాఖల పేర్లు చెప్పమని ఒకరు నన్ను అడిగారు. రక్షణ-హోం-ఆర్థిక శాఖలు అనే సర్వసాధారణమైన సమాధానాన్ని ఆయన ఆశించారు. శాంతిభద్రతలు, రక్షణ అన్నవి రాజ్యవ్యవస్థ అతి ముఖ్య విధులు అయినందున ఈ మంత్రిత్వశాఖలను ముఖ్యమైనవిగా నేను అంగీకరిస్తాను. కాని మంచి భవిష్యత్తునీ, సృజనశీలతనీ దృష్టిలో పెట్టుకుంటే ఆరోగ్యం, పర్యావరణం, విద్యా మంత్రిత్వశాఖలు అతి ముఖ్యమైనవిగా నేను భావిస్తాను. ఎందుకంటే ఈ మూడు మన భవిష్యత్తును రూపుదిద్దుకోడానికి ప్రాతిపదికలుగా వుంటాయి. ఇందులో ఒకటైన విద్య మీద ఇప్పుడు దృష్టి పెడదాం.

ముందుగా విద్యను ఎంచుకోడానికి కారణం ఏమిటంటే ప్రస్తుతం మనం ఆలోచించడానికి దూరం అయ్యాం. మన దేశంలో విద్య కేవలం అనుకరించే మనుషుల్ని ఉత్పత్తి చేస్తున్నది. మిమిక్ మనిషిని తయారు చేస్తున్నది. నాసిరకం సరుకుతో అమెరికాను అనుకరిస్తున్నది. నిజానికి ఇది మనల్ని ప్రపంచంలో అత్యంత హీనస్థితికి చేరుస్తుంది. స్పెల్లింగులను వల్లించడంలో, టైమ్స్ పత్రికలో ఒకరిద్దరి మీద రెండు అంగుళాల ప్రశంసలను వార్తలుగా ప్రచురించడాన్ని మనం విదేశీ విజయాలుగా భావిస్తున్నాం. నిజానికి మేధోపరంగా మనల్ని అందరూ విస్మరిస్తున్న విషయాన్ని గుర్తించలేకపోతున్నాం.

పోటీ అన్నది ఒకరకంగా మంచిదే. కాని మనం దేనిలో పోటీ పడుతున్నాం? అన్నది ముఖ్యం. 19వ శతాబ్దపు ఆలోచనలతో 21వ శతాబ్దంతో పోటీ పడాలనుకుంటున్నాం.

మన దేశంలో చాలా చురుకుదనం వుంది, చొరవవుంది. కాని ఇదంతా పక్కదారిపట్టింది. అసలు విద్యపట్ల మనకున్న అవగాహన, మనం వాడే పదజాలం అంతా లోపభూయిష్టమైనవి. విద్యపట్ల మన వైఖరి ఎలాంటిదో ఒకసారి చూద్దాం. ఇదంతా ఉత్పత్తి, అంకెల భాషలో వుంటుంది. విద్యామంత్రిగారు మాట్లాడుతున్న తీరు చూస్తే ఆయన భవనాలశాఖ మంత్రా లేకవిద్యాశాఖ మంత్రా అన్న సందేహం కలుగుతుంది. నిజానికి ఆయన గృహనిర్మాణ మంత్రిగా కనిపిస్తారు. ఎందుకంటే విద్యను పెంపొందించడం ఒక ప్రత్యేక కళ. ఇది కేవలం అంకెలతో ఆడే ఆట కాదు. అంకెల ఆటకి టార్గెట్స్ వుంటాయి. ఈ టార్గెట్‌లను సాధించడమే లక్ష్యం అయినప్పుడు మంచి ప్రమాణాల మీద, వైవిధ్యం మీద, విషయ పుష్టిమీద చర్చ తెరమరుగవుతుంది.

మరిన్ని ఐ.ఐ.టి.లను, మరిన్ని ఐ.ఐ.ఎంలను సృష్టించే అంకెల ఆట, టార్గెట్ల వేట మొదలవుతుంది. ఇలాంటి విద్యా సంస్థలను క్లోనింగ్ ద్వారా ఉత్పత్తికి మనమే పేటెంట్ హక్కు పొందినట్టుగా ఈ సంస్థల పునరుత్పత్తి సాగిపోతుంది. ఈ సంస్థల అడ్మిషన్ల మీద నిర్వహణ మీద అడపాదడపా చర్చ మినహా వీటి ప్రమాణాల మీద చర్చ మాత్రం వుండదు. ఈ ఐ.ఐ.టి,ఐ.ఐ.యంలలో జరుగుతున్న పరిశోధనా రేటింగ్ అమెరికాలో సాధారణ యూనివర్సిటీల స్థాయి కూడా వుండడం లేదు. నిజానికి "ఆధునిక విశ్వవిద్యాలయం" అన్న భావనే మనకు వంటబట్ట లేదు.

మనం ఇంకా మెకాలే మానస పుత్రులుగానే వున్నాం. ఆయన ప్రేతాత్మ గాంధీజీ దృక్పధాన్ని మింగేసింది. కాని అదే సమయంలో ఒక విచిత్రం కూడా జరిగింది. అది ఇంగ్లీషు మాట్లాడే మధ్యతరగతిని సృష్టించింది. గుడ్డిలో మెల్లగా ఇది సాపేక్షపరంగా ఒక అవకాశం అయింది. అదే మన ఆర్థిక వ్యవస్థకు కొంత శక్తినిచ్చేది అయింది. మొత్తం మీద మన విద్యావ్యవస్థ ఇప్పటికీ ట్యుటోరియల్ కాలేజీల నమూనాలోనే వుంది. విద్యార్థులలో చాలా మంది మేనేజిమెంటు గురు ప్రహ్లాదనీ, ఆర్థిక వేత్త అమర్త్యసేన్‌ని చదివిన వారు కాదు. కే.కే.దేవెట్. మరియు రుద్దార్ దత్‌ల గైడ్స్ చదివి డిగ్రీలు పొందుతున్న వారే అత్యధికులుగా వున్నారు.

ట్యుటోరియల్ కాలేజీ అంటే ఏమిటి? ఇది చదువు సైజు తగ్గించి సూక్ష్మరూపాన్ని ఇచ్చే విశ్వామిత్ర సృష్టి. మెకాలే వికృత కలలకి ఒక సమాజం బలికావడం. పశ్చిమ దేశాల పుస్తక భాండాగారంతో పోల్చినప్పుడు మొత్తం భారతీయ నాగరికత నంతటినీ సేకరించి సర్దినా ఒక అలమారాకు సరిపోదని మెకాలే అహంకార పూరితమైన వాఖ్య చేశాడు. విచిత్రం ఏమిటంటే

ఇప్పుడు మనవాళ్లు మొత్తం పశ్చిమ దేశాల నాగరికతనంతటినీ ఒక అలమారాకి సరిపోయేలా నిస్సారమైన నిత్యావసర పుస్తకాలుగా కుదించగలిగినారు. పైగా ఈ పుస్తకాలను కూడా పిండిచేసి రేణువుల రూపం ఇచ్చారు. ఇలా కుంజి లేదా కాగ్‌పుస్తకం రూపొందింది. దానిని నిత్యనూతనం చేస్తూ మతగ్రంథంగా రూపొందిస్తున్నారు. ఈ పుస్తకాల పబ్లిషర్లు తమ కాల్పనికతని జోడించి 30-40 పునర్‌ముద్రణలు లాగించేస్తున్నారు. మొత్తం మీద మనం విద్యని కుంజీకి, ట్యుటోరియల్ కాలేజీకి మధ్య ఒక సాధనంగా మార్చేశాం ఈ ట్యుటోరియల్ కాలేజీలు అంతిమ లక్ష్యం ఐ.ఐ.టి.ఐ.ఐ.యంలో సీటును అందించడం. ఈ ఐ.ఐ.టిలు తమ అనుకరణ విద్యతో పిల్లలకు లాభదాయకం అవుతున్నాయి.

అనుకరించడం కూడా గొప్పేనని మనం భావించడం మొదలుపెడితే చివరికి అనుకరణ నాగరికతే భారతదేశానికి మిగులుతుంది. మిమిక్రీ అనేది మనుగడకి ఒక తాత్కాలిక పద్ధతి మాత్రమే. ఒక ప్రజాస్వామ్య సమాజంలో సృజనశీలతకి అది ప్రత్యామ్నాయం ఎంత మాత్రం కాదు.

అంతకంటే ముఖ్యమైనది ఏమంటే వలసవాదుల దురాగతాలను అనుకరించే విద్యావ్యవస్థ ద్వారా భారతదేశం చరిత్రను సృష్టించలేదు. సామ్రాజ్యవాదం తన ఏకీకృత అభివృద్ధి నమూనా ద్వారా చేతివృత్తుల నైపుణ్యాలను మ్యూజియంలకు తరలిస్తుంది లేదా వాటిని వాతాపి జీర్ణం చేసుకుని చంపేస్తుంది. మనకి వైవిధ్యంతో కూడిన విజ్ఞాన చత్రాలు కావాలి. మనకున్న వృత్తి నైపుణ్యాలకు కొత్తరూపం ఇచ్చేదిగా, చేతి పనిని మెదడును అనుసంధానం చేసేదిగా వుండాలి. ఇలాంటి వైవిధ్యాలు, నైపుణ్యాలు లిఖిత రూపంలోవున్నా, ముఖతః వున్నా వాటిని నిలుపుకోగలగాలి.

మన యూనివర్సిటీ ఇంకా 19వ శతాబ్దం నాటి గుమస్తాలను, అధికార బృందాన్ని తయారుచేసే పరీక్షల యంత్రంగానే వుంది. మన పాలనాధిపతులు ఇప్పటికీ దాని నుండి ఉత్పత్తి అవుతున్న వారే, దానికి సోదాహరణలుగా వుంటున్నవారే. మనం పరీక్షల వ్యవస్థలో ఆరితేరిన వాళ్లం. కాని పరిశోధన విషయంలో అనామకులం. మనం నూతన విజ్ఞానాన్ని ఆవిష్కరించడంలోను, భారతదేశంలో కనుమరుగవుతున్న స్థానిక విజ్ఞాన వినియోగించుకునే వ్యూహాల రచనలోనూ మనం అసమర్థులం.

మనకి ప్రాథమిక పాఠశాల నుండి, అత్యాధునిక విజ్ఞాన కేంద్రాల వరకు గల అంచెలన్నింటికీ తగిన విజ్ఞాన వ్యవస్థలు అవసరం దీనినంతటినీ ఒక గొలుసులాగ రూపొందించుకోవాలి. ఇది పరస్పరాధారిత ఆహార గొలుసులాంటిది. ఈ గొలుసులో ఒక లింకుకు హాని జరిగితే అది మొత్తం గొలుసునే ధ్వసం చేస్తుంది. ఇలాంటి సమీకృత విజ్ఞాన సిద్ధాంతానికి అవసరమైన విజ్ఞానాన్ని మనం జతచేసుకోవాలి.

మన సమాజంలో వున్న అన్నిరకాల విజ్ఞానాన్ని సజీవంగా నిలబెట్టుకోవాలి. ఒక ఆదివాసీ, ఒకరైతు, ఒక రోడ్డు పక్క దుకాణదారు ఒక సంచార జాతి వ్యక్తిని మనం మనుగడ వ్యూహాలు తీసిన స్త్రీ, పురుషులుగా గుర్తించాలి. ఇలాంటి అనియత ఆర్థిక కార్యకలాపాలన్నీటినీ విజ్ఞాన వ్యవస్థలుగా మనం గుర్తించాలి. ఇలాంటి ప్రజాతంత్ర విజ్ఞానం అంతా మన ప్రజాస్వామ్యాన్ని జనస్వామ్యం చెయ్యడంలో భాగంగా భావించాలి.

ప్రస్తుత "జాతీయ విజ్ఞాన కమిషన్" నిజానికి పని చెయ్యడంలేదు. విద్యకు సంబంధించి కొఠారి, రాధాకృష్ణన్ రిపోర్టులతో సరిపోల్చదగినవి, ప్రస్తుతంలేవు. విద్యని ఆధునిక భావజాలంతో సైన్స్‌కీ, జీవ్యావరణానికీ, సంస్కృతికీ జతచేసి రూపొందించిన ఏకీకృత దృక్పథం మనకి లేదు.

యూరప్‌లో, అమెరికాలలో యూనివర్సిటీల మీద నిరంతరం పునఃపరిశీలనలు జరుగుతున్నాయి. ఇవి కేవలం బడ్జెట్‌కు సంబంధించిన సంస్కరణలు కావు. ఆర్థిక రంగంలో, శాస్త్ర సంబంధమైన వ్యవస్థలలో కీలకమైన మార్పుల చుట్టూ తిరుగుతున్నాయి.

మన విద్యావ్యవస్థ 19వ శతాబ్దం నాటి వ్యూహంగానే వుండిపోయింది. దీనికి అరకొర చేర్పులు సాగించుకుంటూ పోవడమే విద్యా విధానంగా వుంటున్నది. మనకి కావలసింది ఒక "కొత్త విద్యా నివేదిక" ఇది అన్ని తరగతుల జీవనాన్ని ప్రతిబింబించే బ్రిటిష్ కాలపు గెజిటీలా సుసంపన్నంగా వుండాలి. దీనిని సేన్‌గుప్తా రిపోర్టు, మైనారిటీల మీద సచార్ రిపోర్ట్‌ల వంటి కీలక నివేదికలతో అనుసంధానం చెయ్యాలి. విజ్ఞాన యుతమైన ఆర్థిక వ్యవస్థకు చెందిన సిద్ధాంతం కేవలం ప్రభుత్వం నివేదికగా ఉండకూడదు. అది పౌరసమాజంతో, వివిధ ప్రజాసమూహాల జీవనంతో ముడిపడిన నాగరికతను ప్రతిబించించేదిగా వుండాలి. వీటన్నింటి సమాహారంగా ఒక భవిష్యత్ దర్శనానికి అందించే ప్రణాళికగా దానిని రూపొందించాలి. ఇలాంటి ప్రణాళిక మనకి తక్షణ అవసరం. ఇలాంటి భవిష్యత్ దర్శన ప్రణాళికను రూపొందించి అమలు చేసే సంకల్పాన్ని మన రాజకీయ వేత్తలు ప్రదర్శిస్తారా! లేక కాలం చెల్లిన పద్ధతినీ, అవిద్యనీ కొనసాగిస్తారా అన్నదే ప్రశ్న. ■

## వ్యవస్థలో మార్పుకోసం
# పౌర సమాజం ఉద్యమించాలి

- బండారు రామ్మోహన్ రావు

**డిసెంబరు 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం**

**భారతీయుడు సినిమాలో భారతీయుడుగా నటించిన కమల్‌హాసన్ ఒక అవినీతి అధికారిని చంపబోతుంటే... "అవినీతి మనదేశంలోనే వుందా? ప్రపంచమంతా ఉంది కదా! నన్నే ఎందుకు చంపుతున్నారు''? అని ఆ అధికారి కమల్‌హాసన్‌ను ఒక ప్రశ్న అడుగుతాడు. "వేరే దేశాల్లో ఉద్యోగులు చేయగూడని పనికి లంచం తీసుకుంటారని మనదేశంలో మాత్రం వాళ్ళు చెయ్యాల్సిన పనికి కూడా లంచం తీసుకుంటున్నారు కనుక నిన్ను చంపేస్తానని కమల్‌హాసన్ సమాధానం చెప్పి చంపేస్తాడు.**

మనదేశంలో అవినీతి భాగోతాన్ని చూస్తే పై వ్యాఖ్యలు సరిగ్గా సరిపోతాయి. విధిగా ఇవ్వాల్సిన సర్టిఫికెట్ల నుండి మొదలుకుని తప్పనిసరి అందించాల్సిన సౌకర్యాల వరకు లంచం లేనిదే ఫైలు కదలని వైనం మన ప్రభుత్వ ఆఫీసుల్లో కనబడుతుంది.




అవినీతి నిర్మూలనకోసం దేశంలో ఒక పెద్ద చర్చ జరుగుతుంది. ఇటీవల అన్నాహజారే ప్రారంభించిన జనలోక్‌పాల్ ఉద్యమం చూస్తే దేశ వ్యాప్తంగా ప్రజల్లో అవినీతి పట్ల ఎంత ఆర్తి వుందో అర్థమవుతుంది. ఎటొచ్చి అవినీతిపై జరగాల్సిన రీతిలో చర్చ జరగడం లేదు. జరిగిన అవినీతిపై కమిటీలు, విచారణలు విచారణ వ్యవస్థలు తీసుకు రావాలంటున్నామే కాని అసలు అవినీతి జరగకుండా నివారించే మార్గాల గురించి పద్ధతుల గురించి చర్చ జరగడం లేదు.

"ప్రివేన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్" సామెతలాగా అవినీతి జరిగాక విచారించడం కాదు. జరగకుండా నిరోధించే వ్యవస్థ కావాలి. అవినీతి అంటే కేవలం ఒక పనికి డబ్బు తీసుకోవడమే కాదు తను చేయాల్సిన పని చేయకపోవడం కూడా అవినీతే. విధులు ఎగ్గొట్టడం విధి నిర్వహణలో అలక్ష్యం చూపడం కూడా అవినీతి కిందికే లెక్క. అవినీతి మూలాలు తొలగించ కుండా అవినీతిని సమాజంలో నుంచి పూర్తిగా తుడిచివేయలేం. దేశంలో మూడు కోట్ల మంది ప్రభుత్వ, ప్రభుత్వరంగం సంస్థలలో ఉద్యోగులు ఉన్నారు. వీరంతా ప్రతిరోజు తీసుకుంటున్న లంచం సంవత్సరానికి సుమారు 20, వేల కోట్ల రూపాయలని లెక్క తేలింది. చిల్లర



సిగ్గెరగదన్నట్లు మన దేశ రాజధాని ఢిల్లీలో రోడ్లమీద చిల్లర వ్యాపారస్తుల వద్ద పోలీసులు వసూలు చేసే లంచమే సంవత్సరానికి 400 కోట్లుగా తేలింది. ఇక ట్రాఫిక్, రెవిన్యూ, విద్యుత్, మున్సిపాలిటీ ఇలా ప్రజలతో నిత్య సంబంధాలుండే శాఖల లంచాలు లెక్కచేస్తే వేల కోట్లు అవుతుంది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో లంచగొండులంటే సమాజం వేరుగా చూసేది, వెలివేసేది. పాపపు సొమ్ము మంచిది కాదని, పాపభీతితో చూసేది. ఎవరైనా అవినీతి అధికారి ఉంటే జనం ఆయన వెనక చెవులు కొరుక్కునేవారు. కాని ఇప్పుడేమో నీతిపరుడైన అధికారి ఉంటే ఆయన్ని అసమర్ధుడని, పనికిరాని వాడని తేల్చేస్తున్నారు. చివరికి భార్య కూడా పొరిగింటీ మీనాక్షమ్మను చూసారా...... అంటూ మీనాక్షమ్మ భర్త అవినీతి సొమ్ముతో ఆమెను ఎలా సుఖపెడుతున్నారో పాట కూడా పాడేస్తుంది. ఎవరైనా నీతిపరులు ఉంటే 'న ఖాతా హై న ఖిలాతా హై' అంటూ సమాజం వారిని ఎద్దేవా చేస్తుంది. తప్పు సమాజానిది కాదు. మారుతున్న విలువలది కాదు. వ్యవస్థలో వ్యక్తి మారితే వ్యవస్థ మారుతుందని పూజ్య గాంధీజీ భావించారు. అందుకే బెల్లం తినద్దొని పిల్లవాడికి బుద్ధి చెప్పడానికి తను బెల్లం తినడం మానేశాడు. కాని వ్యవస్థలో కొన్ని పద్ధతులు మారడం వల్ల సమాజాన్ని మార్చవచ్చని అంబేద్కర్ భావించాడు. అందుకే మన రాజ్యాంగం, చట్టాలు, కోర్టులు, ప్రభుత్వ ఆఫీసులు అన్నీ వచ్చాయి.

## డిసెంబర్ 9 - అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినం - పూర్వాపరాలు

2003 అక్టోబరు 31వ తేదీన ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశం జరిగింది. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరగనున్న "అవినీతి వ్యతిరేక కన్వెన్షన్" కోసం అడ్‌హాక్ కమిటీ రూపొందించిన తుది నివేదికను ఈ సమావేశంలో చర్చించి ఆమోదించారు.

2003 డిసెంబరు 9 నుండి 11వ తేదీ వరకు మెక్సికోలోని మెరిడాలో తుది సంతకాల కోసం అత్యున్నత స్థాయి రాజకీయ సమావేశం జరిగింది. ఇలా ఐక్యరాజ్యసమితి "అవినీతి వ్యతిరేక కన్వెన్షన్" నివేదిక ఆచరణలోకి వచ్చింది. అందుచేత డిసెంబరు 9వ తేదీని అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినంగా పాటించాలని ఐక్యరాజ్యసమితి 58/222 తీర్మానం ద్వారా ప్రకటించింది. 2004 డిసెంబరు 9 నుండి ప్రపంచవ్యాపితంగా డిసెంబరు 9 అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినంగా పాటించబడుతున్నది.

### అవినీతికి వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి

**డిసెంబరు 2000 :** అంతర్జాతీయంగా పెరుగుతున్న అవినీతిని అడ్డుకునేందుకు ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2000 డిసెంబరులో ఒక అడ్‌హాక్ కమిటీని ఏర్పాటు చేసింది, (తీర్మానం నెం. 55/61/2000)

**డిసెంబరు 2001 -02 :** అవినీతి నిరోధానికి, సరిహద్దులు దాటి అక్రమనిధుల తరలింపును అరికట్టేందుకు, తరలిన నిధుల్ని తిరిగి ఆయా దేశాలకు తరలించడానికి వీలుగా ఐక్యరాజ్యసమితి తీర్మానాలు చేసింది. (తీర్మానం నెం. 58/186/ 2001-57/244/2002)

**మార్చి 2002 :** మెక్సికోలో మోటరీ నగరంలో "అభివృద్ధి కోసం ఆర్థిక సహకారం" అన్న అంశంపై జరిగిన అంతర్జాతీయ సదస్సులో అవినీతిని అన్ని స్థాయిలలో అడ్డుకోవాలని తీర్మానించింది.

**ఆగస్టు 2002 :** "నిరాటంకమైన అభివృద్ధి" (Sustainable Development) మీద ప్రపంచ దేశాల శిఖరాగ్ర సమావేశం దక్షిణాఫ్రికాలో జరిగింది. అవినీతి అన్ని దేశాలకు పొంచి వున్న ప్రమాదంగా జోహెన్స్‌బర్గ్ తీర్మానం స్పష్టం చేసింది.

**అక్టోబరు 31, 2003 :** 2000లో ఐక్యరాజ్యసమితి నియమించిన అడ్‌హాక్ కమిటీ "అవినీతి వ్యతిరేక కన్వెన్ట్" కోసం రూపొందించిన తుది నివేదికను జనరల్ అసెంబ్లీ ఆమోదించింది.

(తీర్మానం నెం : 58/4)

**డిసెంబరు 9-11 :** మెక్సికోలోని మెరిడాలో తుది సంతకాల కోసం ప్రపంచదేశాల అధినేతల సమావేశం జరిగింది. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక కన్వెన్ ప్రారంభ తేదీని అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినంగా ప్రకటించబడింది.

**శ్రీరామ పట్టాభిషేకం సమయంలో శ్రీరామచంద్రమూర్తి 'శాస్త్రబద్ధంగా పరిపాలన చేస్తానని' ప్రమాణం చేస్తాడు. ధర్మబద్ధంగా అనలేదు. ధర్మం అంటే నైతికం. శాస్త్రమంటే చట్టం అన్నమాట.** మన పాలకులు కూడా పదవీ ప్రమాణ స్వీకారం చేసేటప్పుడు రెండు ప్రమాణాలు చేస్తారు. భారత రాజ్యాంగానికి కట్టుబడి పరిపాలన చేస్తానని, అధికార రహస్యాల చట్టం 1923 ప్రకారం తన పదవీకాలంలో చేసిన పనులను ఏవీ బయటపెట్టనని మరో ప్రమాణం చేస్తారు. మొదటి ప్రమాణం ప్రకారం అసలు నడుచుకోరు. ఇక రెండవ ప్రమాణం దుర్మార్గమైంది. అప్పుడెప్పుడో బ్రిటీష్ వాళ్ళు పరిపాలించినప్పటి రోజుల్లో పై అధికారులంతా బ్రిటీష్ వాళ్ళు కింద గుమస్తాలంతా భారతీయులు ఉండేవారు. అధికార రహస్యాన్ని భారతీయ గుమస్తాలు ఎక్కడ బయటపెడతారో అని ప్రజలకి వాస్తవాలు వెలుగులోకి రాకుండా వాళ్ళను కట్టడి చేయటానికి ఈ చట్టాన్ని బ్రిటీష్ వాళ్ళు ఉపయోగించారు. పదవీ విరమణ తరువాత కూడా తాము అధికారంలో వుండగా చేసిన పనుల గురించి చెప్పకూడదు. 2005లో సమాచార హక్కు చట్టం వచ్చిన తరువాత కూడా నేటి ప్రజాస్వామ్య ప్రభుత్వ అధికార రహస్య చట్టాల కింద పరిపాలన విషయాలను దాచిపెడతానని అధికారులతో రాజకీయ నాయకులతో ప్రమాణాలు చేయిస్తుంది. అసెంబ్లీ సభ్యుడి నుంచి మొదలుకుని పార్లమెంటు మెంబరు, రాష్ట్రపతితోసహా ఈ ప్రమాణాలు చేస్తున్నారు. సమాచార హక్కు చట్టానికి ఇది పూర్తిగా వ్యతిరేకం. పాలన జవాబుదారీగా, పారదర్శకంగా ఉండాలంటే పాలనా సమాచారం ప్రజలకు అందాలి. అవినీతి నిర్మూలనకి ఇది మొదటి అంచె. ప్రభుత్వంలో ఏం జరుగుతుందో, అధికారులు ఏం చేస్తున్నారో, ఏ ఫైలు ఎక్కడ ఆగిందో, ఎందుకు కదలడం లేదో తెలుసుకోవాలంటే సమాచార హక్కు కావాలి. సంక్షేమ పథకాలు ప్రజలకు ఎందుకు దక్కడం లేదో, అర్హులు ఎంత మంది వేచి చూస్తున్నారో అనర్హులకు ద్వారాలు ఎలా తెరుస్తున్నారో తెలుసుకోవాలంటే సమాచార హక్కు కావాలి. కాని దురదృష్టవశాత్తూ నేడు అది కరువైంది.

మన రాష్ట్రంలో 2001లో సిటిజన్ ఛార్టర్లు వచ్చాయి. పౌరసేవల్ని సింగిల్ విండో సిస్టం (ఏకగవాక్ష విధానం) లో అందించాలనేది దాని లక్ష్యం. మున్సిపాలిటీలలో పౌర సేవలు అందించడంలో నిర్ణీతసమయం దాటితే ప్రతిరోజు ఆలస్యానికి రూ.50/- చొప్పున పంచాయితీలలో రూ.10/- జరిమానా విధించే ఏర్పాటు కూడా చేసారు. మిగతా వంద పైచిలుకు

### ఐక్యరాజ్య సమితి తీర్మానం ఏం చెప్పింది ?

అభివృద్ధికి అవినీతి ఒక పెద్ద అవరోధం, అలాగే మంచి పాలనకి కూడా అవినీతి అడ్డంకి అవుతుంది. ప్రపంచంలో ఆర్థిక వ్యవస్థ పెంపొందాలన్నా, అభివృద్ధి జరగాలన్నా, సుపరిపాలన ప్రజలకు అందించాలన్నా, అవినీతి అంతం చూడాలి. ప్రజల సొమ్ము అక్రమార్జనపరుల పాలు కాకూడదు. ఒకవేళ అవినీతిపరులు ప్రజల సొమ్ము నొక్కేసి ఏ స్విస్‌బ్యాంకుల్లో దాచేసినా లేక దేశంలోనే ఆస్తులు సంపాదించుకున్నా అలాంటి అక్రమ డబ్బును, ఆస్తుల్ని స్వాధీనం చేసుకుని వాటిని ప్రజలపరం చేయాలని ఐక్యరాజ్య సమితి తీర్మానం పేర్కొంది.

ప్రజల పన్నుల డబ్బు ప్రజోపయోగానికి ఖర్చు కావాలి. దానికి ఆయా వ్యవస్థలో అవినీతి ఉండకూడదు. అవి సంక్షేమ పథకాలే కావచ్చు, పౌరసేవలే కావచ్చు, కాంట్రాక్టులు, లైసెన్సులు ఇతర ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలే కావచ్చు. వీటిలో అవినీతి ఉండకూడదు. దానికి పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మాత్రమే అవినీతికి విరుగుడని ఐక్యరాజ్య సమితి తీర్మానం చెప్పింది.

ఐక్యరాజ్య సమితి రూపొందించిన అవినీతి వ్యతిరేక తీర్మానంపై 2003లో మన దేశం సంతకం చేసింది. కాని ఆ తీర్మానం స్ఫూర్తిని అమలుకు ఉద్యుక్తమవడానికి ఏడేళ్ళు పట్టింది. 2011మే నెలలో మనం ఆ తీర్మానాన్ని పునరుద్ఘాటించుకున్నాం. ఇప్పటిదాకా మనం ప్రపంచదేశాలకు మాయమాటలు చెప్పి నమ్మబలికాము. ఒకసారి సంతకం పెట్టాక దానికి కట్టుబడి వుండకుండా స్టేటస్కోలో ఉంచేశాం. ఈ మేరకు జర్మనీలోని కొన్ని బ్యాంకులు మనదేశంలోని అక్రమార్జనాపరులు తమ దేశంలో దాచుకున్న బ్యాంకు అకౌంట్‌ల జాబితా మనదేశానికి పంపించాయి. స్విస్‌బ్యాంకు మాత్రం ఇంకా అంతర్జాతీయ నిబంధనలు, ఒప్పందాలపేరిట మీనమేషాలు లెక్కిస్తూ జాబితా అందించడానికి జాప్యం చేస్తుంది. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే జర్మనీదేశం పంపించిన జాబితాలోని వ్యక్తుల ఆదాయవ్యయాలను పరిశీలించి నిజానిజాలను తేల్చవచ్చు.

ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఈ సిటిజన్ ఛార్టర్లు జరిమానా లేకుండా కొనసాగిస్తున్నారు. సిటిజన్ ఛార్టర్లు ప్రారంభించి పదేళ్ళవుతున్నా అనుకున్న లక్ష్యం మేరకు పనిచేయడం లేదు. చాలా ఆఫీసుల్లో ఆ బోర్డులే కనిపించవు. కనిపించినా జరిమానా విధించే అంశాన్ని బోర్డుపై రాయరు. పౌర సేవలను చట్టంబద్ధం చేసే చట్టం బీహార్‌లో వచ్చింది. బీహార్ తరహా పౌరసేవల చట్టం వస్తే తప్ప ప్రజలకు పౌరసేవలు అందవు. హక్కుగా పౌరసేవలని పొందేరోజు వచ్చినప్పుడే అవినీతి నిర్మూలన జరుగుతుంది.

అవినీతి స్వరూపం మారింది. ఒకనాడు లంచం తీసుకుంటేనే అవినీతి. తాను మంజూరు చేయాల్సిన డబ్బులో కొంత శాతం లంచంగా ఇచ్చుకుంటే అది మంజూరు అయ్యేది. అలాగే ఒక నిర్మాణపు పని పూర్తి చేసిన తరువాత ఆ కాంట్రాక్టరు ఆ పనికి మంజూరు అయిన మొత్తంలో కొంత శాతం ఇంజనీర్లకి సమర్పించుకుంటే తప్ప పని కొలతలు పూర్తయ్యేవికావు. అలాగే రాజకీయ నాయకులు ఏదైనా తమ పలుకుబడితో పనులు చేయిస్తే దానికి సరిపడా నజరానాలు స్వీకరించేవారు. దోపిడీ స్వరూపం మారింది. ఈ చిన్న చిన్న లంచాలు సరిపోవడం లేదు. భూమిని, గనుల్ని, సముద్రతీరాన్ని చివరికి 'గాలి'(2జి స్పెక్ట్రం కుంభకోణం)ని కూడా అమ్ముకోనే దుర్దశ పట్టింది. ఒక పని చేయాలంటే దాని ఎస్టిమేషన్ పదింతలు పెంచిన డబ్బును స్వాహా చేయడమే నేటి అవినీతిగా మారింది. రాష్ట్ర కేంద్ర బడ్జెట్లలో ఎంత దోచుకున్నా సరిపోవడం లేదు. దానికి అదనంగా నాయకులు అధికార యంత్రాంగం దోచుకోవాలంటే ప్రకృతి వనరులన్నింటిని కట్టకట్టి, చుట్టబెట్టి భోంచెయ్యడమే నేటి అవినీతిగా మారింది. న్యాయవ్యవస్థ క్రియాశీలంగా మారి విజృంభించినప్పుడు మాత్రమే అక్కడక్కడా విచారణలు, అరెస్టులు జరుగుతున్నాయి. కోర్టుపేరు చెప్పి విచారణ చేసినా చివరికి అవినీతిపరులు బయటపడుతున్నారు. ఎక్కడయినా అరకొర శిక్షలు పడ్డా నాలుగేళ్ళు జైల్లో వుండొచ్చి తాము సంపాదించిన ఆస్తులు తరతరాలు అనుభవిస్తున్నారు. అక్రమంగా సంపాదించిన అవినీతిపరుల ఆస్తుల్ని జప్తుచేయడం ఒక్కటే దీనికి పరిష్కారం.

అన్నాహజారే ప్రతిపాదించిన జనలోక్‌పాల్ బిల్లులో కూడా చాలా లోపాలున్నాయి. బంట్రోతు మొదలు ప్రధానమంత్రి దాకా లోక్‌పాల్ పరిధిలోకి తీసుకురావాలని ఆయన అంటున్నారు. న్యాయ వ్యవస్థను కూడా ఇందులో చేర్చాలని హజారే పట్టుపడుతున్నారు. దేశంలోని మూడుకోట్ల మంది ఉద్యోగుల్ని లోక్‌పాల్ పరిధిలోకి తీసుకువస్తే విచారణలకే వందేళ్ళు పడుతుంది. సమాచార హక్కు చట్టంలాగే దేశంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్త, జిల్లాలలో అంబుడ్స్‌మన వ్యవస్థ ఏర్పరచాలి. వీటికి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలి అప్పుడే విచారణ త్వరగా పూర్తవుతుంది. అవినీతిపరులకి శిక్షపడుతుంది. అవినీతిపరులని తేలగానే వారి ఆస్తుల్ని పూర్తిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి. శిక్ష పడ్డా ఆస్తులు ఉంటాయనే ఆశ వుండకూడదు.

కుక్క తోకను ఆడించాలి కాని, తోక కుక్కను ఆడించకూడదు. రాజకీయమనేది ఒక కుక్క అధికార యంత్రాంగం తోక లాంటిది. రాజకీయ సరిగ్గా నడిస్తే అధికారులు సరైన దారిలో వెళతారు. రాజకీయమే తప్పుదోవ పడితే ఆ వ్యవస్థను ఎవరూ కాపాడలేరు. మనదేశంలో ఓటుకు నోటు, మద్యం ఇచ్చి గెలిచే సంస్కృతి పోకుండా దేశంలో అవినీతి నిర్మూలన సాధ్యం కాదు. రాజకీయ పాలనా సంస్కరణల ద్వారా అవినీతి నిర్మూలన సాధ్యమవుతుంది. దీనికి రాజకీయ చిత్తశుద్ధి కావాలి. ఎవడూ చచ్చేమందు మింగడు. చిలకలో దాగున్న తమ ప్రాణాల రహస్యాన్ని ఎవరూ బయటపెట్టరు. అందుకే దానికి తగిన వ్యవస్థలను రూపొందించాలి. పౌర సమాజం దానికి ఉద్యమించాలి. అప్పుడే అవినీతి మూలాలు తొలగిపోతాయి. ■

## అమెరికాలో మాజీ గవర్నర్‌కు 14 ఏళ్ళ జైలుశిక్ష

**షికాగో :** పదవిని అడ్డంపెట్టుకుని రాజకీయ అవినీతికి పాల్పడ్డారనే ఆరోపణలపై అమెరికాలో ఇలినాయిస్ రాష్ట్ర మాజీ గవర్నర్ రాడ్ బ్లేగోజెవిచ్ కు జైలుశిక్ష పడింది. పలు రకాల అవినీతి కార్యకలాపాలతోపాటు, అధ్యక్షుడు బరాక్ ఒబామా ఖాళీ చేసిన సెనేట్ స్థానాన్ని అమ్ముకోనేందుకు యత్నించారనే ఆరోపణపై ఆయనకు 14 ఏళ్ళ కారాగార శిక్ష పడింది. ఇందులో ఆయన కనీసం 12 ఏళ్ళ శిక్షను అనుభవించాల్సి వుంటుంది. 20 వేల డాలర్ల జరిమానా విధించారు. 2012 ఫిబ్రవరి 16 నుంచి శిక్ష కోసం జైళ్ళ బ్యూరో ఎదుట లొంగిపోవాలని రెండు రోజులపాటు సాగిన తుది విచారణ సందర్భంగా కోర్టు స్పష్టం చేసింది. బ్లేగోజెవిచ్ గవర్నర్ పదవిలో ఉన్నప్పుడు సదరు ఆరోపణలపై 2008, డిశంబరు 9న అరెస్టు అయ్యారు. 2009లో పదవి కోల్పోయారు.

# చెరకుకు సలహాధర (ఎస్‌ఏపీని) ను వెంటనే ప్రకటించాలి

## రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన స్వతంత్ర రైతు సంఘాలు

**చెరుకుకు రాష్ట్ర ప్రభుత్వ సలహా ధర (ఎస్ఏపీ)ని వెంటనే ప్రకటించి చెరకు కర్మాగారాలు విధిగా ఆ ధరను రైతుకు చెల్లించేందుకు చట్టసవరణ తీసుకురావాలని లోక్‌సత్తా పార్టీ, స్వతంత్ర రైతు సంఘాల సమాఖ్య అధ్యక్షులు డా॥ జయప్రకాష్ నారాయణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ఎన్. కిరణ్‌కుమార్ రెడ్డికి డిశంబరు 13న జేపీ లేఖ రాశారు.**

**ఎరువులు, కూలీల ఖర్చు పెరుగుతున్న స్థాయిలో చెరకు సేకరణ ధర పెరగకపోవటంతో రాష్ట్రంలో చెరకు సాగు రైతులు తీవ్ర నిస్పృహలో ఉన్నారని, ఈ నేపథ్యంలో తాత్సారం లేకుండా రాష్ట్రప్రభుత్వం వెంటనే ఎస్ఏపీని ప్రకటించాలని ఆ లేఖలో పేర్కొన్నారు.**

ఎస్ఏపీని ప్రకటించే చట్టపరమైన అధికారం తమకు లేదని రాష్ట్రప్రభుత్వానికి సందేహాలుంటే, ఆంధ్రప్రదేశ్ సుగర్‌కేన్ (సరఫరా మరియు కొనుగోలు నియంత్రణ) చట్టం, 1961ని తమిళనాడు చట్టం తరహా సవరణలు చేపట్టాలి.

"ప్రస్తుతమున్న ఆంధ్రప్రదేశ్ సుగర్‌కేన్ చట్టంలోని సెక్షన్ 3 (1), 4 (ఎ), 19 (1) ప్రకారం రాష్ట్ర సర్కారు నిస్సందేహంగా ఎస్ఏపీని ప్రకటించవచ్చు. ఒక నోటిఫికేషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్ సుగర్‌కేన్ సలహా సంఘాన్ని ఏర్పాటు చేయటానికి, ఫ్యాక్టరీలకు, ఖండసారి విభాగాలకు సరఫరా, కొనుగోలు నియంత్రణ, కర్మాగారానికి సరఫరా అయిన చెరకుకు సహేతుక అనిపించే ధరను చెల్లించే దిశగా చర్యలకు ఇందులో ఏర్పాట్లు ఉన్నాయి. 1961 చట్టంలో అలాంటి ఏర్పాట్లు నిర్దిష్టంగా లేవని ప్రభుత్వం భావిస్తున్నందున 'తమిళనాడు సుగర్ ఫ్యాక్టరీస్ కంట్రోల్ చట్టం, 1949'లో సెక్షన్ 12 తీరుగా స్పష్టమైన ఏర్పాట్లు ఉండేలా వెంటనే చట్టాన్ని సవరించాలి".

"తమిళనాడు చట్టం, సెక్షన్ 12 ప్రకారం, క్రషింగ్ సీజన్ ప్రారంభానికి ముందు లేదా తర్వాత ఎప్పుడైనా సలహా సంఘంతో చర్చించి అందరికీ వర్తించేలా లేదా ఫ్యాక్టరీలవారీగా రైతులకు విధిగా చెల్లించాల్సిన రేటును ప్రభుత్వం నోటిఫికేషన్ ద్వారా ప్రకటించవచ్చు. ఒకవేళ రేటును ప్రకటించకపోతే రేటును లెక్కించే విధానాన్నయినా ప్రభుత్వం ప్రకటించవచ్చు. అలాగే 12 (1) ప్రకారం ఆ రేటును లేదా రేటును లెక్కించే విధానాన్ని కూడా మార్పు చేసి కొత్తగా చేసే చెరకు సేకరణకు వర్తింపజేస్తూ నోటిఫికేషన్ జారీ చేసే అధికారం కూడా ప్రభుత్వానికి ఉంటుంది. ఫ్యాక్టరీల యాజమాన్యాలు చెరకు రైతులకు చెల్లింపులను ఎన్ని దఫాలుగా చెల్లించవచ్చో కూడా ప్రభుత్వం నిర్ణయిస్తుంది. తాను చెల్లించే ధర నుంచి ఎటువంటి మినహాయింపుల్నీ ఫ్యాక్టరీల యాజమాన్యాలు తమ సొంతంగా చేసే అవకాశం లేకుండా ఈ చట్టంలో తగు జాగ్రత్తలు ఉన్నాయి... ఇలాంటి ఏర్పాటును ఆంధ్రప్రదేశ్ సుగర్‌కేన్ చట్టం, 1961లో కూడా చేరిస్తే, న్యాయపరమైన సందేహాలకు ఆస్కారం లేకుండా మన రాష్ట్రప్రభుత్వం కూడా నిస్సంకోచంగా ఎస్ఏపీని ప్రకటించవచ్చు".

తమిళనాడు చట్టంలో ఉన్న ఏర్పాట్లతో వెంటనే రాష్ట్రంలో కూడా సుగర్‌కేన్ చట్టాన్ని మార్చేందుకు వెంటనే చర్యలు తీసుకుని, చెరకు టన్నుకు కనీసం రూ.2500 చెల్లించాలని, చెరకు కటింగ్, రవాణా ఖర్చులను ఒకవేళ ఫ్యాక్టరీలే భరిస్తే టన్నుకు కనీసం రూ.2000 ప్రకటించాలని ముఖ్యమంత్రిని జేపీ కోరారు. ■

### తెలంగాణ ప్రజలను వంచిస్తున్నారు

**నిజాంషుగర్స్‌ను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి : జేపీ**

కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు అధికారం కోసం తెలంగాణలో ప్రాంతీయ వాదాన్ని రెచ్చగొట్టి, ప్రజలను వంచించాయని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ్ విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో రైతుసంఘాల నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. చిన్న రాష్ట్రాల ఏర్పాటును ప్రజలు కోరుకుంటే దానికి లోక్‌సత్తా వ్యతిరేకం కాదని, జిల్లా ప్రభుత్వాలు ఏర్పాటు చేయాలని తమ పార్టీ కోరుతోందన్నారు. 2002లో తెదేపా నిజాం షుగర్స్‌ను ప్రైవేటీకరించినపుడు వ్యతిరేకించిన కాంగ్రెస్, తర్వాత తాను అధికారంలో కొచ్చాక ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. నిజాం షుగర్స్‌ను వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. మాది రైతు ప్రభుత్వం అంటున్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డి మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలన్నారు. టన్ను చెరుకుకు కనీసం రూ.2500 ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# లోక్‌పాల్ బిల్లుపై పార్లమెంటరీ సంఘం 'పసలేని' నివేదిక

*లోక్‌పాల్‌పై విప్లవాత్మక తీరులో వ్యవహరించే సువర్ణావకాశాన్ని పార్లమెంటరీ సంఘం జారవిడుచుకుంది. "లోక్‌పాల్‌పై పార్లమెంటరీ సంఘ: ఇటీవల సమర్పించిన నివేదికలో చాలా అంశాలలో యథాతథ స్థితిని కొనసాగించింది. జాతి ఎదుర్కొంటున్న అవినీతి సవాలును సమర్థవంతంగా ఎదుర్కోగలిగే పటిష్టమైన లోక్‌పాల్ వ్యవస్థను త్వరితగతిన రూపొందించేలా పార్లమెంటును ఒప్పించేందుకు ఈ నివేదిక తోడ్పడాలి. కాని దానికి విరుద్ధంగా పార్లమెంటరీ సంఘం లోక్‌పాల్‌పై 'పసలేని' ప్రతిపాదనలతో నివేదక సమర్పించింది. ఈ లోపాల్ని విజ్ఞతతో సరిచేసి ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించాలి. వీటికి తగిన పరిష్కారాలు పౌరసమాజం నుండి రావాలి.*

అవినీతిని పకడ్బందీగా కట్టడిచేసే దిశగా కొత్త వ్యవస్థను రూపొందించి తగినన్ని అధికారాలను ఇచ్చేందుకు విప్లవాత్మకంగా వ్యవహరించే అవకాశాన్ని లోక్‌పాల్‌పై పార్లమెంటరీ సంఘం జారవిడుచుకుందని జేపీ పెదవి విరిచారు. పార్లమెంటులో అసాధారణరీతిలో రాజకీయ సంకల్పం వ్యక్తమవటం, జాతియావత్తూ ఆకాంక్షించటం, మీడియా కవరేజీ వీటన్నిటి నేపథ్యంలో సంఘానికి మంచి అవకాశం లభించిందన్నారు. తొలుత మీడియాలో వచ్చిన కథనాల ప్రకారం, పార్లమెంటరీ సంఘం విప్లవాత్మకంగా వ్యవహరించి లోక్‌పాల్ నివేదికను రూపొందించిందని భావించామని, అయితే ఆ స్థాయిలో ఆ నివేదిక లేదని అన్నారు.

లోక్‌పాల్‌కు స్వతంత్ర ప్రతిపత్తి, లోకాయుక్త ఏర్పాటు, రెంటికీ రాజ్యాంగప్రతిపత్తి, ఫిర్యాదులను విచారించి ప్రాసిక్యూట్ చేసే అధికారం, స్వతంత్ర ప్రాసిక్యూటర్‌లను నియమించే అధికారం, ప్రత్యేక కోర్టుల ఏర్పాటు, జాతీయ జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు ప్రతిపాదన... పార్లమెంటరీ సంఘం నివేదికలోని ఈ అంశాలన్నిటినీ లోక్‌సత్తా స్వాగతిస్తోంది.

**పార్లమెంటరీ స్థాయిసంఘం నివేదికలోని లోపాలు - పరిష్కారాలు**

"1. పార్లమెంటరీ సంఘం నివేదిక ప్రకారం సీబీఐ/ఏసీబీ ఇప్పుడున్నట్టే కొనసాగుతాయి.
   సీబీఐ/ఏసీబీ లను లోక్‌పాల్ / లోకాయుక్తల పరిధిలోకి తీసుకురావాలి.
2. సీబీఐ/ఏసీబీ సీవీసీ కూడా యధాతథంగా కొనసాగుతుంది. సీవీసీ సభ్యులను లోక్‌పాల్‌లో ఎక్‌అఫీషియో సభ్యులుగా చేయటం ఉత్తమం. లోక్‌పాల్ తరహాలోనే సీవీసీలో నియామకాలు జరగాలి. అప్పుడు లోక్‌పాల్ సంస్థపై ఎక్కువ భారం లేకుండా మొత్తం దిగువస్థాయి ఉద్యోగుల కేసులపై సీవీసీ తనంతతాను సమర్థవంతగా దృష్టి సారించగలుగుతుంది. దోషులపై ఖచ్చితమైనరీతిలో చర్యలు తీసుకోగలుతుంది.
3. రాష్ట్రాలలో స్థానిక అంబుడ్స్‌మన్‌లను ఏర్పాటు చేసుకునే అధికారం లోకాయుక్తలకు ఉండాలి. దీనివల్ల దిగువస్థాయి అధికారులపై లోకాయుక్త పర్యవేక్షణలో అంబుడ్స్‌మన్‌లు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.
4. ప్రధానమంత్రిని తగనన్ని ముందుజాగ్రత్తలతో, కొన్ని మినహాయింపులతో లోక్‌పాల్ పరిధిలోకి తేవాలి".

చట్టాలలో, అవినీతి కేసుల విచారణలో ఉన్న లోపాలను సరిచేసేందుకు లభించిన ఒక సువర్ణావకాశాన్ని కూడా పార్లమెంటరీ సంఘం జారవిడుచుకుంది.

**చట్టాలు/ వ్యవస్థలలో చేయాల్సిన మార్పులు**

"1. సీబీఐ/ఏసీబీ ఎటువంటి అవరోధాలు లేకుండా అవినీతి కేసులపై విచారణ చేపట్టేందుకు వీలుగా ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం సెక్షన్ 6ఏను, రాష్ట్రప్రభుత్వాల ఆదేశాలను పాటించాల్సిన నిబంధనలను తొలగించాలి
2. ప్రజాసేవకులందరినీ ప్రాసిక్యూట్ చేయటానికి వీలుగా పీసీఏ సెక్షన్ 19ని, సీఆర్‌పీసీ సెక్షన్ 197ను తొలగించాలి
3. లాలూచీతో లంచం ఇచ్చినవారు, తీసుకున్నవారు ఖజానాకు, ప్రజలకు నష్టం కలిగించిన కేసులో శిక్షల్ని మరింత కఠినం చేయటం
4. అవినీతికి పాల్పడ్డ ప్రజాసేవకుల ఆస్తుల్ని జప్తు చేసేందుకు సెఫ్మా (ఎస్ఏఎఫ్ఈఎంఏ) చట్టం, న్యాయ కమిషన్ సిఫార్సులు, ముసాయిదా తరహాలో చట్టాన్ని రూపొందించి అమలు చేయటం
5. అన్ని అవినీతి నిరోధక కేసులలో స్వతంత్ర ప్రతిపత్తి గల ప్రాసిక్యూషన్‌ను నియమించాలి.

లోక్‌పాల్ ముసాయిదాపై ఈ లోపాలన్నిటిపై అన్ని రాజకీయ పార్టీలకు, పార్లమెంటు సభ్యులకు సవివరంగా తెలియచేయాల్సిన అవసరముంది. అవినీతి నిరోధానికి ఒక బలమైన, ప్రభావశీలమైన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు పౌర సమాజం సమిష్టిగా కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ■

# లెవీ బియ్యం సేకరణ ధర పెంపు - దిగొచ్చిన కేంద్రం

- లెవీ బియ్యం ధరల నిర్ధరణ
- తీరనున్న ఇబ్బందులు
- బకాయిల చెల్లింపునకు అంగీకారం

లెవీ బియ్యం ధరలను నిర్ణయించడంలో కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు దిగివచ్చింది. లెవీ బియ్యం ధరలను పెంచుతూ శుక్రవారం కేంద్రం నిర్ణయం తీసుకుంది. దీంతో మిల్లర్ల ప్రధాన సమస్య పరిష్కారమైంది. వరి ధాన్యం మద్దతు ధరను పెంచినా దీనిక అనుగుణంగా బియ్యం ధరలను నిర్ణయించకపోవడంతో మిల్లర్ల గత కొద్ది రోజులుగా లెవీ బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు ఇవ్వకుండా దాదాపుగా నిలిపివేశారు. దీంతో ధాన్యం కొనుగోళ్లపై ప్రభావం చూపింది. అనేక మంది మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవడానికి సిద్ధమయ్యారు. ఇటీవల ధాన్యం మద్దతు ధరను ప్రభుత్వం రూ॥80 వరకు పెంచింది. పెరిగిన ధరకు అనుగుణంగా బియ్యం ధరలు పెంచాలని కోరుతూ మిల్లర్లు అనధికారికంగా ఆందోళన చేస్తున్నారు.

ఈ పరిస్థితిని మిల్లర్లు రాష్ట్ర ఎంపీల దృష్టికి తీసుకువెళ్లడంతో పదిమంది ఎంపీలు పది రోజుల కిందట కేంద్ర ఆహార శాఖ మంత్రి థామస్‌ను కలిసినా ప్రయోజనం కన్పించలేదు. దీంతో రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డి కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. దీనిపై ఆయన ఆహార మంత్రిత్వ శాఖ కార్యదర్శితో మట్లాడారు. తక్షణం దీనిపై నిర్ణయం తీసుకోకపోతే ఈ విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకువెళతామని హెచ్చరించారు. దీంతో ఆహార మంత్రిత్వశాఖ స్పందించి కొత్త ధరలను విడుదల చేసింది. ఈ ఏడాది అక్టోబర్ ఒకటో తేదీ నుంచి సేకరించిన బియ్యానికీ కొత్త ధరలు వరిస్తాయని, పాత బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

| బియ్యం గ్రేడ్ | పాత రేటు | కొత్తరేటు |
|---|---|---|
| కామన్‌రకం పచ్చిబియ్యం | రూ॥1679.70పై | రూ॥1814.70పై |
| గ్రేడ్ ఏ పచ్చిబియ్యం | రూ॥1727.10పై | రూ॥1862.20పై |
| కామన్‌రకం ఉప్పుడుబియ్యం | రూ॥ 1670.50పై | రూ॥1803.80పై |
| గ్రేడ్ ఏ ఉప్పుడు బియ్యం | రూ॥1717.40పై | రూ॥1850.60పై |

# ఏపీలో సేద్యానికి తలసరి కేటాయింపు రూ.240/-

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తన ప్రణాళిక వ్యయంలో వ్యవసాయ రంగానికి చేస్తోన్న తలసరి కేటాయింపు కేవల రూ.240/- మాత్రమే. ఈ విషయాన్ని స్వయానా కేంద్ర ప్రభుత్వమే వెల్లడించింది. లోక్‌సభలో ఓ సభ్యుడు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు కేంద్ర ప్రణాళిక శాఖ సహాయమంత్రి అశ్వినికుమార్ సమాధానం ఇచ్చారు. 2008-09 నుంచి 2011-12 మధ్య కాలంలో రాష్ట్ర బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధి తలసరి కేటాయింపులు పెరుగుతున్నా... వ్యవసాయరంగం కేటాయింపులు మాత్రం తగ్గుతున్నాయి.

ఇదే సమయంలో గ్రామీణాభివృద్ధి తలసరి కేటాయింపులు రూ॥ 350/- నుంచి 498/- చేరాయి. మన పక్కనున్న కర్నాటక ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తలసరి వాటాను రూ॥ 396/- నుంచి రూ॥ 611/- కి పెంచింది. తమిళనాడు రూ॥ 195/- నుంచి రూ॥ 301/- చేర్చింది. కేరళ కూడా మనకంటే అధికంగా రూ॥ 277/- కేటాయిస్తోంది. వ్యవసాయరంగానికి గోవా అత్యధికంగా తలసరి రూ॥ 804/- కేటాయిస్తుండగా... పశ్చిమబెంగాల్ అత్యల్పంగా రూ॥ 96/- ఇస్తోంది.

| సంవత్సరము | రాష్ట్రంలో వ్యవసాయానికి తలసరి కేటాయింపు |
|---|---|
| 2008-09 | రూ॥ 252/- |
| 2009-10 | రూ॥ 141/- |
| 2010-11 | రూ॥ 174/- |
| 2011-12 | రూ॥ 240/- |

# వెల వెలబోతున్న ప్రభుత్వ బడులు

**ప్రాథమిక పాఠశాలల్లో తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య**

**పదుల సంఖ్యలోనే చేరిక**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల తీరు విద్యావేత్తలను కలవరపరుస్తోంది. ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో కంటే ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతి ఏడాది గణనీయంగా తగ్గిపోతోంది. ప్రాథమిక విద్య అభివృద్ధికి కేంద్రం రూ. వేల కోట్లు వెచ్చిస్తున్నా రాష్ట్రంలోని పరిస్థితులు ఆందోళనను కలిగిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గిపోతున్నందున రానున్న నాలుగైదు సంవత్సరాల్లో ఈ ప్రభావం ఉన్న పాఠశాలలపై పడుతుంది. ప్రస్తుతానికి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు కాస్త ఆశాజనకంగానే ఉన్నాయి. వివిధ పథకాల అమల్లో భాగంగా అధికారులు 2010-11లో విద్యార్థుల చేరిక గణాంకాలు పరిశీలించగా ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

- 20 మంది విద్యార్థులు మాత్రమే ఉన్న ప్రాథమిక పాఠశాలలు 6816
- 30 మంది లోపు ఉన్నవి 18,929 (ఇక్కడ ఒకటి నుంచి ఐదు వరకు పాఠాలు చెబుతారు.)
- 30 మంది లోపు విద్యార్థులు ప్రాథమికోన్నత పాఠశాలలు 193 (ఇక్కడ ఒకటి నుంచి ఏడో తరగతి వరకు పాఠాలు చెబుతారు.)
- 10 మంది మాత్రమే విద్యార్థులు ఉన్న ఉన్నత పాఠశాలలు10,17 మంది విద్యార్థులు మాత్రమే ఉన్న ఉన్నత పాఠశాలలు 17 (ఇక్కడ ఆరు నుంచి పది వరకు పాఠాలు చెబుతారు.)

**2010-11లో పాఠశాలల పరిస్థితి ఇదీ....**

| పాఠశాల స్థాయి | 20లోపు విద్యార్థు లున్నవి | 21-25 | 26-30 | 31-50 | 51-100 | 101-150 | 151-200 | 201-300 | 301-400 | 400 పైన | మొత్తం బడులు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ప్రాథమిక | 6816 | 7319 | 4794 | 15185 | 11310 | 4937 | 2091 | 1074 | 205 | 70 | 53,801 |
| ప్రాథమికోన్నత | 67 | 53 | 73 | 709 | 3231 | 2543 | 1152 | 693 | 123 | 26 | 8,670 |
| ఉన్నత | 10 | 03 | 04 | 51 | 520 | 1428 | 1467 | 2373 | 1499 | 2014 | 9369 |

## లోక్‌సత్తా పార్టీ నూతన కార్యాలయం చిరునామా

**లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యాలయం బషీర్‌బాగ్ నుండి బంజారాహిల్స్‌కు మార్చబడింది కొత్త ఆఫీసు చిరునామా మరియు ఫోన్ నంబర్లు ఈక్రింద ఇవ్వడమైనది. కావున గమనించగలరు.**

### ఆఫీసు చిరునామా :

**8-2-674బి/2/9, ప్లాట్ నం : 93**
**హ్యాపీ వ్యాలి, రోడ్ నం.13ఎ,**
**బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034**

### ఆఫీసు ఫోన్ నంబర్లు

**23311819, 23311817**
**23311820, 23312829**
**ఫ్యాక్స్ : 23310612**

### డిశంబరు 16న ఖమ్మంలో అవినీతి వ్యతిరేక భహిరంగ సభలో జేపీ ఉద్ఘాటన

# ఓటు ఆయుధంతో అవినీతిని రూపుమాపాలి

**ఓటు అనే ఆయుధంతో యువతరం నేటి నేటి అవినీతి రాజకీయాలకు సమాధానం చెప్పాల్సి ఉందని లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, శాసనసభ్యుడు డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ తెలిపారు. రాజకీయాల్లోకి యువరక్తం రావడంతోపాటు, వారసత్వ రాజకీయాలు పూర్తిగా రూపుమాపినప్పుడే సామాజిక మార్పు వస్తుందని అన్నారు.**

ఖమ్మం పట్టణంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో నిర్వహించిన అవినీతి వ్యతిరేక పోరాట సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తాత్కాలిక పరిష్కారం కోసం రాజకీయనాయకులు అమలు రూపొందిస్తున్న చట్టాల మూలంగా అన్ని వర్గాల ప్రజలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో తాయిలాలు ప్రకటిస్తూ ప్రజలను మోసంచేసి గద్దెనెక్కుతున్న వారు ఆక్రమాలకు పాల్పడితే వారి ఆస్తులు జప్తుచేసే విధంగా బలమైన చట్టాలు కావాల్సి ఉందన్నారు. లోక్‌పాల్ బిల్లుతో అవినీతి అంతం కాదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. పటిష్టమైన చట్టాన్ని అమలు చేయాల్సిన కార్యనిర్వహక శక్తి దేశానికి అవసరమన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న రిజర్వేషన్ల విధానం వల్ల కొన్ని వర్గాలు నష్టపోతున్నారని, వీటిలో ఆర్థికర పరమైన రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఆర్థిక పరమైన రిజర్వేషన్ల వల్ల అగ్రవర్ణాల్లో ఉన్న నిరుపేదలు సైతం అభివృద్ధి సాధించే అవకాశం ఉందన్నారు.

ఈ సందర్భంగా పెవిలియన్ గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అవినీతి వ్యతిరేకసదస్సులో ఆయన విద్యార్థులతో కొద్దిసేపు చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వేసిన ప్రశ్నలకు ఆయన తనదైన శైలిలో సమాధానాలిచ్చారు.







# లోక్‌సత్తా పార్టీ- మీడియాలో కవరేజీ

*లోక్‌సత్తా పార్టీకి మీడియాలో కవరేజీ, ప్రచారం తగినంతగా లేదు, టీవీలలో చూపిస్తే ఒక నిమిషం చూపుతారు, పత్రికలలో కూడా పార్టీకి పెద్దపెద్ద వార్తలు రావు, వచ్చినా ప్రతిరోజూ రావు, పార్టీ కార్యక్రమాల్ని, స్పందనల్ని, విషయాల్ని తెలుసుకోవాలంటే చాలా ఇబ్బందిగా ఉంది అని చాలామంది పార్టీ కార్యకర్తల, అభిమానుల, ప్రజల ఫిర్యాదు. లోక్‌సత్తాకు వచ్చిన ఓట్లు, సీట్లు కంటే ఎక్కువ కవరేజీ ఇస్తున్నారని కొందరు సాంప్రదాయ పార్టీల నేతల, రంధ్రాన్వేషకుల ఆరోపణ. ఒక రాజకీయ పార్టీకి కవరేజీ ఇవ్వటానికి ఎటువంటి ప్రాతిపదికలు ఉండాలి, ఆ క్రమంలో లోక్‌సత్తా పార్టీకి మీడియాలో కవరేజీ ఎలా ఉండాలి అనే అంశంపై ఓ బాధ్యతాయుత పౌరుడు చేస్తున్న స్థూల విశ్లేషణ ఇది...*

ఏదో ఒక పేరుతో ఒక రాజకీయ పార్టీని నమోదుచేసుకుని, బోర్డు తగిలించుకున్నంత మాత్రాన కవరేజీ ఇవ్వాలా అంటే ఇవ్వనక్కర్లేదనే చెప్పాలి. ఒక రాజకీయ పార్టీ వార్త అయినంతమాత్రాన, ఆ పార్టీకి చెందిన పదవిలో ఉన్న నేత మాట్లాడినంత మాత్రాన విధిగా ప్రచురించటమో, ప్రసారం చేయటమో చేయాలన్న అవసరం ఎంతమాత్రం లేదు. కానీ దాదాపు 30 ఏళ్లకు పైగా ప్రజాజీవితంలో ఉంటూ, అనుక్షణం ప్రజాహితం కోసం తపిస్తూ, నభూతో అనే రీతిలో ప్రజలకు మేలుచేసే విజయాలను సాధించటంతోపాటు, దేశంలో మౌలికమార్పులకు సంస్కరణలను తెచ్చి వ్యవస్థ ప్రక్షాళన కోసం ఉద్యమిస్తున్న వ్యక్తి స్థాపించిన పార్టీగా లోక్‌సత్తాకు ఖచ్చితంగా కవరేజీ ఇచ్చి తీరాలి. అలాగే లోక్‌సత్తా పార్టీ భావజాలం, విధానాలు. ఇవి తప్పన్నవారు దాదాపు లేరు. అందరూ ఇవి కావాలని కోరుకుంటున్నవారే. ఇవి తప్ప మార్గంలేదని, లోక్‌సత్తా కృషి ఉండాల్సిందేనని తీవ్ర విమర్శకులు, రాజకీయ ప్రత్యర్థులు సైతం అంటుంటారు. మాది అహింసాయుత నక్సలిజం అని స్పష్టంగా చెప్పగలిగే పార్టీ లోక్‌సత్తా ఒక్కటే. ఈ రెండో కోణంలో చూసినా కూడా లోక్‌సత్తాకు కవరేజీ ఇవ్వాలి, ఇప్పుడిస్తున్నదానికంటే అనేక రెట్లు ఎక్కువ ఇవ్వాలి... ఈ అంశాల్ని కాస్త లోతుగా పరిశీలిద్దాం.

భారత రాజ్యాంగం ప్రపంచంలోనే ఒక అద్భుతమైన డాక్యుమెంట్ అని ప్రస్తుత వ్యవస్థను నిరసిస్తున్నవారు సైతం అంగీకరించకతప్పని సత్యం. 18వ శతాబ్దంలో ఫ్రెంచి విప్లవం వంటి గొప్ప ఘటన చోటుచేసుకున్న సమయంలో ఇలాంటి రాజ్యాంగం ఉండి ఉంటే ఈవేళ ప్రపంచగతి వేరుగా ఉండేదని అంటుంటారు. నివారించదగ్గ బాధల్ని తొలగించి పుట్టుకతో కుల,మత,ప్రాంత,భాష,లింగ,ఆర్థిక వివక్షలేవీ లేకుండా ప్రతి బిడ్డా తన సామర్థ్యం మేర వికసించి జీవనభద్రతతో స్వతంత్ర జీవనం గడిపేందుకు నిర్దిష్ట గ్యారంటీనిచ్చే ఏర్పాట్లతో భారత ప్రజలు రాసుకున్న విశిష్ట పత్రం భారత రాజ్యాంగం. ఎన్ని సమస్యలున్నా హింసకు, విద్వేషాలకు ఆస్కారం లేకుండా సామరస్యంగా పరిష్కరించుకునేందుకు తగిన మార్గాలు, ఏర్పాట్లు మన రాజ్యాంగంలో పొందుపరచబడి ఉన్నాయి. ఒక్క కలంపోటుతో పెనుమార్పు తెచ్చే ఏర్పాటు ఉంది. అయితే రాజ్యాంగంలో పొందుపరచిన ఉదాత్త ఆశయాలకు, సమాజ స్థితిగతులకు మధ్య సంఘర్షణ వచ్చినప్పుడు సమన్వయం చేసి సమతుల్యపరిచే రాజకీయ వ్యవస్థ లేకుండా రాజ్యాంగం ఆశించిన లక్ష్యాలు నెరవేరవు. అందులో ఎన్నో సంక్లిష్టతలు, భిన్నత్వాలు ఉన్న భారతదేశం వంటి సమాజంలో ఈ ఘర్షణలు మరీ ఎక్కువగా, తరచుగా వస్తుంటాయి. రాజకీయ వ్యవస్థ సక్రమంగా లేకపోతే తాము ఆశించిన లక్ష్యాలు నెరవేరవని ఆరోజు రాజ్యాంగనిర్మాతలు వెలిబుచ్చిన భయాలు ఈవేళ నిజమవుతున్నాయి. ప్రతి చిన్న అంశానికి, సమస్యకు రోడ్లెక్కటం, హింసకు దిగటం ఆనవాయితీగా మారింది. రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజాప్రతినిధులుగా ఉన్నవారు, ప్రభుత్వం నడుపుతున్నవారిలో ఎక్కువమంది ఆ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి హింసకు, అవినీతికి, బంధుప్రీతికి, దేశద్రోహానికి పాల్పడుతుంటే ఇక రాజ్యాంగం ఎలా పనిచేయగలుగుతుంది? తమ చవటాయితనాన్ని, తప్పిదాల్ని, అవినీతిని, బంధుప్రీతిని, ద్రోహచింతనను రాజ్యాంగానికి ఆపాదించి రాజ్యాంగం విఫలమైంది కాబట్టి రాజ్యాంగ వ్యతిరేక, సంక్షోభ విధానాలను ఆశ్రయిస్తున్నామని కొందరు ప్రజాప్రతినిధులే నిస్సిగ్గుగా

మాట్లాడుతున్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షిస్తూ మరింత పటిష్టంగా అమలు చేసేందుకు తమ వంతు కృషి చేయాల్సిందిపోయి, తమ స్వార్థ ప్రయోజనాల కోసం రాజ్యాంగబద్ధ పాలనను దెబ్బతీస్తున్న శక్తులతో చేతులు కలుపుతున్నారు. రాజ్యాంగాన్ని తిరిగి రాయాలి వంటి అజ్ఞానపు లేదా ప్రమాదకర మాటల్ని మాట్లాడుతున్నారు. రాజ్యాంగం ఛత్రం కింద రక్షణ పొందుతున్నవారు కూడా అసహనంతో రాజ్యాంగవ్యతిరేక చర్యలు పాల్పడటం పరిస్థితిని మరింత దిగజారుస్తోంది. రాజ్యాంగం సక్రమంగా అమలై మన జాతీయోద్యమ నేతలు కలలు గన్నట్టు అందరికీ ఎదిగే అవకాశాలు రావాలంటే... రాజ్యాంగాన్ని విధిగా అమలు చేయటం అందరి బాధ్యత. రాజ్యాంగంలో మార్పులు కావాలంటే రాజ్యాంగబద్ధంగా మార్చుకోవచ్చు. ఇది పూర్తిస్థాయిలో జరగాలంటే మన రాజకీయ వ్యవస్థను, సంస్కృతిని మార్చుకోకతప్పదు. ఈ రెండో స్వతంత్ర పోరాటానికే లోక్‌సత్తా పార్టీ కొత్త తరానికి కొత్త రాజకీయం నినాదంతో ఆవిర్భవించింది. జనం చేతికి అధికారాన్నిచ్చి ప్రజల్ని ప్రభువులుగా నిలిపే లోక్‌సత్తా పార్టీ ప్రజలలోకి వెళ్లాలంటే మార్గమేమిటి? మీడియాది అందులో కీలకపాత్ర. ఇక్కడే సమస్య తలెత్తింది.

రాజకీయాలను అడ్డంపెట్టుకుని ఏదో లబ్ధి పొందేందుకు పార్టీ పెట్టి, చివరకు సరైన కారణం కూడా లేకుండా 2009 ఎన్నికల బరి నుంచి వైదొలగిన ఒక పార్టీ అధ్యక్షుడు 2008లో ఒక మీడియా సమావేశంలో మాట్లాడుతూ... 1శాతం ఓట్లు కూడా లేని (అప్పటికి) లోక్‌సత్తా పార్టీకి మీడియా చాలా ఎక్కువ కవరేజీ ఇస్తోందని, తమ పార్టీకి ఇవ్వటం లేదని పనిగట్టుకుని అక్కసు వెళ్లగక్కారు. మీడియా సమాజానికి దర్పణం మాత్రమేనని, ప్రజలు కోరుకుంటున్నది మాత్రమే చూపటం మీడియా బాధ్యతని, ఎలాగోలా ఓట్లు-సీట్లు పొందినవారి, అధికారంలో ఉన్నవారి వార్తలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తుందని, ఎంత విలువ ఉన్నా మిగిలినవారి విషయంలో తాము సానుభూతి చూపటం మినహా చేయగలిగిందేమీ లేదని చాలా మీడియా సంస్థల వాదన. ఈ వాదనలు ఎంతమాత్రం సహేతుకం కాదు. ప్రజలు కోరుకుంటున్న అంశాల పట్ల మీడియా స్పందించాల్సిందే, అయితే అదే సమయంలో ప్రజలకు అవసరమైనది కూడా తెలియచెప్పి ఆ దిశగా వారిని ప్రేరేపించాల్సిన బాధ్యత కూడా మీడియాదే. మీడియా సమాజానికి దర్పణమేకాదు, మంచి మార్పునకు చోదకశక్తి కూడా కావాలి. అమ్ముడయ్యే వార్తలను అమ్మటం కాదు, ప్రజలకు అవసరమైన మంచి వార్తలను అమ్మగలగాలి. అది మీడియా సంస్థల, జర్నలిస్టుల సామర్థ్యానికి, నిబద్ధతకు గీటురాయి. 1950వ దశకంలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఓ వ్యాసంలో చేసిన వ్యాఖ్యను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. ప్రజలకు మేలుచేసే వార్తలను, ప్రతిపక్షాల వార్తలను మొదటి పేజీలలో ప్రచురించి, అధికార పార్టీ వార్తలను లోపలి పేజీలలో ప్రచురించాలని, ప్రజాస్వామ్యం బలోపేతమవటానికి అది దోహదం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఈ కోణంలో చూస్తే లోక్‌సత్తా పార్టీకి అత్యధిక కవరేజీ రావాలి. మీడియా తన వంతు బాధ్యతగా సహకారం అందించివుంటే 2009 ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీకి ఓట్ల శాతం గణనీయంగా పెరిగిఉండేదనటంలో, ఈ రాష్ట్ర రాజకీయ పరిస్థితి




భిన్నంగా ఉండేదనటంలో సందేహం లేదు. అసలు మీడియా తన లక్ష్యాలకు కట్టుబడి, తన తాత్విక పునాదిని అర్థం చేసుకుని, తన చారిత్రక కర్తవ్యాన్ని నెరవేరిస్తే లోక్‌సత్తా పార్టీకి ఇంకా అనేకరెట్లు కవరేజీ రావాలి.

అవినీతికి వ్యతిరేకంగా లోక్‌సత్తా ఒక రాజకీయ ఉద్యమంగా అలుపెరుగని పోరాటం చేస్తుంటే, సీబీఐ, ఏసీబీలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పించాలని, అవినీతి కేసులను ప్రత్యేక కోర్టులలో స్వతంత్ర ప్రాసిక్యూషన్‌తో విచారించి అవినీతిపరుల ఆస్తుల్ని జప్తు చేయాలని ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తుంటే, ఆ ప్రాతిపదికలతో 2009లో లోకాయుక్తను బలోపేతం చేసేలా అవినీతి నిరోధక చట్ట సవరణ బిల్లును లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే జె.పి అసెంబ్లీలో ప్రవేశపెడితే, జాతీయ స్థాయిలో అదే తరహా స్వతంత్ర ప్రతిపత్తిగల అవినీతి నిరోధక

కమిషన్ లేదా లోక్‌పాల్‌ను తీసుకురావాలని పోరాడుతుంటే మీడియా ఎంతమేర మద్దతిచ్చింది? 2 జీ కుంభకోణంపై లోక్‌సత్తా చేసిన పోస్టుకార్డుల ఉద్యమానికి కార్డు సైజు వార్తలు కూడా రాలేదు. అలాంటి కృషికి అండగా మీడియా బాధ్యత కాదా? అలాంటి చట్టాలు ఎందుకు తేవటం లేదని రాష్ట్రంలో, జాతీయస్థాయిలో ప్రభుత్వాలను, పార్టీలను ఎందుకు నిలదీయలేకపోయింది? మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం, ఉపాధి నైపుణ్యాల శిక్షణ, ఉపాధి అవకాశాల కల్పన, స్థానిక ప్రభుత్వాలకు అధికారాలను, నిధుల్ని బదిలీ చేయటంతోపాటు ప్రజలకు తలసరి కనీసం రూ. 1000 నేరుగా అందించే ఏర్పాటు చేసి వార్డు ప్రభుత్వాలను ఏర్పాటు ద్వారా జనం చేతికి అధికారం ఇవ్వటం, వ్యవసాయాన్ని లాభసాటి చేసి పరిశ్రమలతో అనుసంధానం చేయటం, చిన్నపట్టణాలను అభివృద్ధి కేంద్రాలుగా మార్చటం వంటి విధానాలు, బహిరంగ చర్చ ప్రమాణాలు పెంచటం, బంద్‌లు-రాస్తారోకోలు వంటి ప్రజలకు అసౌకర్యం కలిగించే పద్ధతులు లేకుండా ప్రజలను ఆలోచింపచేసేరీతిలో నిరసనలు, ఆందోళనలు చేపట్టటం వంటి అంశాలను రాజకీయాలకు కేంద్రబిందువుగా చేసుకుని లోక్‌సత్తా చేస్తున్న కృషి ప్రజలకసాధికారతకు ఎంతో అవసరమైనప్పుడు వాటిని మీడియా ఎందుకు వార్తలకు కేంద్రబిందువు చేయటం లేదు? మంచి పాఠశాల విద్యను అందించటం ద్వారా తప్ప ప్రజల జీవితాల్ని ఎలా బాగుచేయగలమో, ఇన్నాళ్లూ ఆ అంశాన్ని రాజకీయానికి కేంద్రబిందువు చేయకుండా ఎందుకు తాత్కాలిక తాయిలాలు, మద్యంతో ప్రజల జీవితాల్ని నాశనం చేస్తున్నారని సాంప్రదాయ రాజకీయ పార్టీలను నిలదీసి వాటి మీద చర్చల్ని ఎందుకు చేపట్టలేదు? నాణ్యమైన విద్యను అందించటం ఎలా సాధ్యం అనే అంశం మీద ఎందుకు సృజనాత్మక కథనాలు రాలేదు?

ఓట్లు, సీట్లు ఉన్న పార్టీకి ఖచ్చితంగా కవరేజీ ఇవ్వాల్సిందే. కానీ పార్టీ స్థాపించిన వ్యక్తుల చరిత్ర, గత కృషి, పార్టీ భావజాలం, విధానాలు, అంతర్గత ప్రజాస్వామ్యం, స్వయందిద్దుబాటుకు ఏర్పాట్లు... ఇవన్నీ పరిశీలించి చూస్తే ఓట్లు, సీట్లు ఉన్న పార్టీలకి తీసిపోకుండా, ఆ మాటకొస్తే కొన్ని సందర్భాలలో ఎక్కువగానే లోక్‌సత్తాకు కవరేజీ ఇవ్వాలి.

అయితే మీడియా సంస్థల యాజమాన్యాల తీరు ఎలా ఉన్నా, మీడియా స్వభావం ప్రాథమికంగా నైతికతతో ముడిపడిఉన్నందున లోక్‌సత్తాకు విధిగా కొంత కవరేజీ వచ్చే అవకాశముంటుంది. ఈ అవకాశాన్ని సమాజంలో మంచి మార్పు సాధించేదిశగా కృషి చేస్తూ తమ వృత్తిగతంగా, వ్యక్తిగతంగా తమ బాధ్యతకు న్యాయం చేయాలనుకునే జర్నలిస్టులు, లోక్‌సత్తా పార్టీ నేతలు కూడా సద్వినియోగం చేసుకోవాలి. సాంప్రదాయ పార్టీలలోలాగా లోక్‌సత్తాలో పనిచేస్తే ఏదో పదవో, ఎక్కడో భూమో, ఇతర ప్రోత్సాహకాలో రావు. త్యాగాలు లేకుండా దేశానికి తన వంతు బాధ్యతగా సేవ చేసేవారు, స్థానికంగా ఎక్కడికక్కడ బాధ్యతలు తీసుకుని, నిధుల్ని సమకూర్చుకుని కార్యక్రమాలు నిర్వహించుకునేవారు ఇందులో పనిచేస్తుంటారు. వీరు పూర్తిసమయం పార్టీకి కేటాయించకపోవటం, సమాజంలో నాయకత్వ కొరత ఉండటం వల్ల కొంత నెమ్మదిగా పనిచేస్తూ వీరు మీడియాను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. కానీ నిరాశనిస్పృహల్ని పక్కనపెట్టి కొత్త రాజకీయానికి సిసలైన ప్రతినిధుల్లా వ్యవహరిస్తుంటే తమకు అప్రయత్నంగా వచ్చే అవకాశాల్ని వీరు అందుకోగలుతుతారు. అందుకోసం వార్డు నుంచి మొదలుపెట్టి అన్ని స్థాయిలలో మీడియాతో సత్సంబంధాల్ని కలిగివుండాలి. ఎవరినైనా తిడితేనో, తాత్కాలిక సంచలనాలకు దిగజారితేనో లోక్‌సత్తాకు కవరేజీ వస్తుందనే భ్రమను వీడాలి. అందుకైతే లోక్‌సత్తా అక్కర్లేదు. ఒక సందర్భానికి తగ్గట్టు లోక్‌సత్తా నిర్దిష్టంగా స్పందిస్తే, ఆ అంశానికి సరైన కవరేజీ వస్తే దాన్ని మించిన సంచలనం ఇంకోటి ఉండదు. ఈ దిశగా మీడియాలో మనకుండే అవకాశాల్ని పూర్తిగా వినియోగించుకోగలగాలి. అలాగే వార్తలలో మన పేరు రాకపోయినా, సమాజానికి మంచి చేయటం కోసం మన వద్ద ఉన్న సమాచారాన్ని (అవసరమైతే పరిశోధించి/సేకరించి కూడా) మీడియాకు ఇచ్చి ప్రోత్సహిస్తుండాలి. జర్నలిస్టులలో వృత్తిపట్ల నిబద్ధతతను పెంచుతూ లోక్‌సత్తా పార్టీ నూతన జన రాజకీయం అవసరం దిశగా వారిని స్పందింప చేస్తుండాలి. పార్టీకి సంబంధించిన విధానాలను, నూతన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు మీడియాకు తెలియచేస్తుండాలి. జర్నలిస్టులు సమాజహితం దిశగా తమ కృషిని పెంచుకుంటుంటే లోక్‌సత్తా పార్టీయే ఎక్కువ లాభపడుతుంది గదా. తమకంటే ఎవరైనా బాగా చేసేవారు ఉంటే వారిని చూసి లోక్‌సత్తా కూడా నేర్చుకుంటుంది.

ఇలా జర్నలిస్టుల, పార్టీ నేతల వ్యక్తిగత కృషితోపాటు... మీడియావ్యవస్థ తన వంతు బాధ్యతగా లోక్‌సత్తా పార్టీకి తగినంత కవరేజీ ఇస్తూ రెండో స్వతంత్ర పోరాటంలో తన వంతు పాత్రను పోషిస్తే, రాజకీయం కొందరు వ్యక్తుల, కుటుంబాల గుత్తాధిపత్యం నుంచి బైటపడి అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే ఓ ఉత్తమ వ్యాసంగంగా రూపొందుతుంది. రాజ్యాంగనిర్మాతల కలలు నెరవేరతాయి. ■

# రష్యాలో ఎన్నికలు స్వయంప్రతిపత్తి లేని ఎన్నికల కమీషన్

- డి.వి.వి.యస్. వర్మ

ఈ ఎన్నికలు రష్యాకు ఎంతో ముఖ్యమైనవి. డిసెంబరు 4న రష్యా పార్లమెంటుకు (డ్యూమా) జరిగిన ఎన్నికలలో ఓటు వేసిన వారిలో దాదాపు సగం మంది అధికార పార్టీ యునైటెడ్ రష్యాకి ఓటు వేశారు. మిగిలిన సగం మంది ఇతర పార్టీలను ఎంచుకున్నారు. 2007 ఎన్నికలతో పోల్చినప్పుడు అధికార పార్టీ దాదాపు 15శాతం స్థానాలను కోల్పోయింది. మిగిలిన పార్టీలు తమ బలాన్ని పెంచుకున్నాయి.

నా దృష్టిలో యీ ఎన్నికలలో కొన్ని సకారాత్మక అంశాలున్నాయి. ఇంత పెద్ద దేశంలో సాంకేతికపరంగా చూస్తే ఎన్నికలను బాగానే నిర్వహించినట్లు అనిపిస్తున్నది. చట్టపరంగా కొన్ని అంశాలు మెరుగుపడ్డాయి. మొట్టమొదటిసారిగా అన్ని పార్టీలకు టెలివిజన్‌లో ప్రచారానికి అవకాశం లభించింది. ఇది పోటీపడే అభ్యర్థులకు కొంత సమతుల్యతను కల్పించింది.




అదేసమయంలో ఈ ఎన్నికలలో అనేక లోటుపాట్లు కనిపించాయి. ఈ ఎన్నికలలో ప్రభుత్వం, అధికార పక్షమూ కలగలసి వుండడం కనిపించింది. రాజకీయ పోటీకి పరిమితులు విధించడం అందులో ఫెయిర్‌నెస్ లేకపోవడం వంటివి వున్నాయి. ఈ ఎన్నికల్లో 7 పార్టీలు బరిలో వున్నప్పటికీ, ఎన్నికలకు ముందు కొన్ని పార్టీలకు రిజిస్ట్రేషన్ తిరస్కరించడం తో పోటీ తగ్గింది. జరిగిన పోటీ కూడా అధికార పక్షానికి మొగ్గుచూపే తీరులో జరిగింది. కేంద్ర ఎన్నికల కమీషన్ వుంది. కాని దానికి స్వతంత్ర ప్రతిపత్తి లేదు. ప్రసార సాధనాలు దాదాపుగా అన్న పక్షపాతాన్నే ప్రదర్శించాయి. ప్రభుత్వాధికారులు వివిధ స్థాయిలో జోక్యం చేసుకున్నారు.

ఈ ఎన్నికలకు పరిశీలకులుగా పార్లమెంటరీ అసెంబ్లీ ఆఫ్‌ది ఆర్గనైజేషన్ ఆఫ్ సెక్యూరిటీ అండ్ కో ఆపరేషన్ ఇన్ యూరప్ (ఒ.యస్.సి.ఇ), కౌన్సిల్ ఆఫ్ యూరప్ సంస్థల ప్రతినిధుల్ని స్టేట్ డ్యూమా తరపున ఆహ్వానించారు. రష్యన్ డ్యూమా కూడా ఈ రెండు సంస్థలలో ప్రాతినిధ్యాన్ని కలిగివుంది. అందువల్ల ఈ ఇంటర్ నేషనల్ అసెంబ్లీ ఇతర దేశాలలో ఎన్నికల పరిశీలక పాత్ర నిర్వహించేటప్పుడు రష్యన్ డెప్యూటీలుకూడా పాలు పంచుకునే వీలుంది.

ఈ ఇంటర్ నేషనల్ సంస్థలకి "ఎన్నికల పరిశీలన" అన్నది అత్యంత కీలకమైంది. ఈ సంస్థలు తమ సభ్యదేశాలలో ప్రజాస్వామ్య ప్రక్రియను మరింత మెరుగుపర్చడం కోసం పనిచేస్తున్నాయి. జనవరి 23వ తేదీన నేను నా తుది నివేదికను

స్ట్రాస్‌బర్గ్‌లో వున్న కౌన్సిల్ ఆఫ్ యూరప్‌కు సమర్పించడం జరుగుతుంది. రష్యాలో ఎన్నికలు జరిగిన మరునాడే నేను నా ప్రాథమిక పరిశీలనాంశాలను వెల్లడించడం జరిగింది. దానిపై రష్యన్ అధికార వర్గాలకు చెందిన పలువురు పలు వ్యాఖ్యాలు కూడా చేశారు. అందువల్ల నా అభిప్రాయాలను సంక్షిప్తంగా క్రోడీకరించి ప్రకటించడం అవసరం అని భావిస్తున్నాను.

ఓటింగ్ జరిగే రోజున పోలింగ్ ప్రక్రియను బాగానే నిర్వహించారు. 10 పోలింగ్ కేంద్రాలకు 9 కేంద్రాలలోనైనా ఓటింగ్ ప్రారంభానికి ముందు చేపట్టాల్సిన పద్ధతుల్ని పాటించారు. బాలట్ బాక్సులు ఖాళీగా వున్నాయా లేదా అన్న పరిశీలనతో పాటు ఇతర పద్ధతులు పాటించారు.

చాల పోలింగ్ స్టేషన్లలో వివిధ పార్టీల ప్రతినిధులు ప్రత్యేకించి అధికార పక్షానికి చెందిన యునైటెడ్ రష్యాపార్టీ, కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. అలాగే మొత్తం పోలింగ్ స్టేషన్లలో 1/4 వంతులో జర్నలిస్టు ప్రతినిధులు వున్నారు. ఎలక్ట్రానిక్ టచ్ స్క్రీన్ పద్ధతిలో ఓటింగ్‌ను బాగానే నిర్వహించడం. మొత్తం మీద సాంకేతికలోపాలు, ఇబ్బందులు లేకుండానే నిర్వహించారు.

పోతే ఓట్ల లెక్కింపులో మాత్రం లోపాలు కనిపించాయి. సరైన వ్యవస్థాగత ఏర్పాట్లు లేకపోవడం, పారదర్శకత లోపించడంతో ఓట్ల లెక్కింపులో నియమాల ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. ఓట్ల లెక్కింపు సమయంలో విధిగా పాటించాల్సిన నియమాలను తరచుగా పాటించడం జరగలేదు.

చాల సందర్భాలలో ఎన్నికల అధికారుల పాలైన ఓట్ల సంఖ్యను సంతకాలను, వినియోగించని ఓట్ల సంఖ్యని సరిపోల్చి చూడడం జరగలేదు. దాదాపు సగం పోలింగ్ స్టేషన్లలో సంతకాలు చేసిన పత్రాలను బహిరంగంగా ప్రదర్శించ లేదు. కొన్ని చోట్ల మానిప్యులేషన్ జరిగినట్లు కనిపిస్తున్నది. అంతకంటే కొన్ని చోట్ల బాలట్ బాక్సులను స్టఫింగ్ చేసినట్లు కనిపిస్తున్నది.

మొత్తం మీద రష్యన్ ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించే రిఫరీ లేకపోవడం ప్రధానమైన లోటుగా కనిపిస్తున్నది. కేంద్ర ఎన్నికల కమీషన్‌కు విశ్వసనీయత లేదు. అందుచేత దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియకు అదే అవరోధం అయింది. అత్యధిక పార్టీలకు యీ ఎన్నికల కమీషన్ నిష్పాక్షిత పట్ల విశ్వాసం లేదు. అన్నిస్థాయిలలో ఎన్నికల కమీషన్లు ఇతర ప్రభుత్వ సంస్థలకు సంబంధం లేకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తాయన్న నమ్మకము లేదు. పైగా అధికార పార్టీ అయిన యునైటెడ్ రష్యన్ పార్టీ పక్షపాతిగా వుండడాన్ని అందరూ ప్రశ్నిస్తున్నారు. ఈ అభిప్రాయాలకు ప్రాతిపదికలు కూడా వున్నాయి.

కేంద్ర ఎన్నికల సంఘం తనకు అందిన ఎన్నికల ఫిర్యాదుల మీద చేసే నిర్ణయాలు ఒకదానిలో మరొకటి పొంతన లేనివిగా వుంటున్నాయి. చాలా సందర్భాలలో ఈ ఫిర్యాదుల మీద ఎలాంటి చర్చలేదా ఎలాంటి నిర్ణయాలు జరగవు. ఒకవేళ అలాంటి చర్య ఏదైనా తీసుకుంటే ఒక ప్రభుత్వ సంస్థకీ, అధికార పార్టీకీ మధ్య కనీసవ్యత్యాసాన్ని చూపే స్థితి వుండదు. దీనికో మంచి ఉదాహరణ ఏమిటంటే యునైటెడ్ రష్యాపార్టీ, మాస్కో ఎన్నికల కమీషన్ రెండూ ఒకే తరహా పోస్టర్లను విడుదల చేశాయి. ఈ రెండు పోస్టర్లు దాదాపు సమానంగా వుండడంతో ఓటర్లు గందరగోళ పడడం సహజం.

వివిధ స్థాయిలలో ఎన్నికల కమిటీల సభ్యులలో ప్రభుత్వ మరియు మున్సిపల్ అధికారులకు సంఖ్య సగానికంటే మించి వుండకూడదని చట్టం నిర్దేశిస్తున్నది. కాని చాలా ప్రాంతీయ ఎన్నికల కమిటీలు దీనిని పాటించడం లేదు. కొన్ని రిజియన్లలో ఎన్ని కమిటీల అధిపతుల నియామకంలో అధికార యూనైటెడ్ రష్యాపార్టీ హవా సాగుతోందని అనేక ఫిర్యాదులు వస్తున్నాయి.

ఎన్నికల ప్రక్రియను మెరుగుపర్చాలంటే కేంద్ర ఎన్నికల కమీషన్‌తో సహా అన్ని స్థాయిలలో ఎన్నికల కమిటీలను సత్వరం సమూలంగా సంస్కరించడం అత్యంత అవసరం. ప్రజాస్వామ్య క్రీడ ఫెయిర్‌గా వుండాలి. ఫలితాలను అందరూ ఆమోదించేలా వుండాలి. దీనికి అన్ని పార్టీలు నిర్వహించే ఒక వ్యవస్థ వుండాలి ఒక నిష్పాక్షికమైన రిఫరీ వున్నప్పుడే అది సాధ్యం అవుతుంది.

## టైనీ కాక్స్

దచ్ పార్లమెంటు సభ్యుడు, రష్యాలో డిసెంబరు 4న జరిగిన ఎన్నికలలో కౌన్సిల్ ఆఫ్ యూరప్ తరపున పరిశీలక బృందానికి అధిపతిగా వున్నాడు.

# రష్యన్ పార్లమెంటు ఎన్నికల ప్రహసనంతో ఉవ్వెత్తున లేచిన ప్రజాస్వామ్య సంస్కరణల ఉద్యమం

2011 డిసెంబరు 4న రష్యన్ పార్లమెంటుకు (స్టేట్‌డ్యూమా) ఎన్నికలు జరిగాయి. ఎన్నికల ఫలితాలను కూడా ప్రకటించారు. 450 స్థానాలున్న పార్లమెంటుకు అధికార పార్టీగా వున్న యునైటెడ్ రష్యా పార్టీకి 238 స్థానాలు కమ్యూనిస్టులకు 92 స్థానాలు జస్ట్ రష్యా పార్టీకి 64, నేషనల్ విజువల్ డెమోక్రాటిక్ పార్టీకి 56 సీట్లు వచ్చినట్టు సెంట్రల్ ఎలక్షన్ కమీషన్ ప్రకటించింది.

ఒక పక్క ఎన్నికలు, లెక్కింపు జరుగుతుండగానే మరొకపక్క ఎన్నికల లెక్కింపులో అక్రమాలు, రిగ్గింగులు, బాలట్ బాక్స్‌లను కొత్త ఓట్లతో నింపడం వగైరాలపై యువ ఓటర్లు వీడియోలు తీసి ఇంటర్ నెట్ ద్వారా విశేష ప్రచారాన్ని కల్పించారు. ఎన్నికల కమీషన్ చేసిన ప్రకటనలో కూడా అధికార పార్టీ 15 శాతం ఓట్లను కోల్పోయి సగానికి కొంత తక్కువ (49.3) 49.3 శాతంతో గెలుపొందింది. కాని ఎగ్జిట్‌పోల్స్‌లో అధికార పార్టీకి కేవలం 27.5 శాతం ఓట్లు కంటే అధికంగా రావని పబ్లిక్ ఒపీనియన్ ఫౌండేషన్ తేల్చి చెప్పింది. దాదాపు 20-22 శాతం ఓట్లు అధికార పార్టీ తారుమారు చేసిందని ప్రజలు భావిస్తున్నారు. దీంతో డిసెంబరు 4 ఎన్నికలు ముగిసిన మరునాడే వేలాదిమంది మాస్కో తదితర నగరాలలో ప్రదర్శనలు చేశారు. ఈ ఎన్నిక రద్దు చెయ్యాలని, తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఈ ఉద్యమం మరోవారం గడిచేసరికి ప్రభంజనం అయింది. 1992 సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తర్వాత అంటే 20 ఏళ్ల తర్వాత ఇప్పుడు దేశంలో పెనుమార్పులు జరిగే పరిస్థితి కనిపిస్తున్నది. రష్యాలో ఎన్నికల్లో అవకతవకలు జరగడం, ఫలితాలు తారుమారు కావడం ఇదే మొదటి సారికాదు. అయితే ఇలాంటి వ్యతిరేకత వ్యక్తం కావడం మాత్రం ఇదే మొదటిసారి. కొన్ని వేల మందితో ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు వారం తిరిగేసరికి మాస్కోలోనే 1 లక్షమందితో జరగడం విశేషం పైగా రష్యాలో సుమారు 100 నగరాలకు ఈ ఉద్యమం విస్తరించింది.



ఇంతకుముందు అరబ్ దేశాలలో ప్రజా నిరసనలకు ఇంటర్ నెట్ సాధనం అయినట్లుగానే రష్యాలో ఈ నిరసన వెల్లువలో అదే ప్రముఖ పాత్ర పోషించింది. రష్యాలో 5కోట్ల మందికి ఇంటర్‌నెట్ అందుబాటులో వుంది. యూరప్‌లో అత్యధిక ఇంటర్‌నెట్ వినియోగదారులున్న దేశం రష్యా.

ట్యునీషియా, ఈజిప్టులలో, రష్యాలో కూడా మధ్యతరగతి వర్గాలు ఈ ఉద్యమాన్ని నిర్వహిస్తున్నాయి. అయితే వీరు అసంతృప్తితో, నిరుద్యోగంతో తిరుగుబాటుకు దిగిన యువతకాదు. రష్యాలో ఈ ఉద్యమం చేస్తున్న యువత మంచి ఉపాధి అవకాశాలు, సంపాదన గలవారు. వృత్తి,

విద్యానిపుణులుగా వున్నవారు, ఆఫీసు ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు. పైగా వీరు అహింసా మార్గాన్నే అనుసరిస్తున్నారు. ఈ నిరసనకారులలో అత్యధికులు మొదటిసారి ఓటు వేసినవారు అలాగే ఇంతకు ముందెప్పుడు ఆందోళనలలో పాల్గొనకుండా మొదటిసారి ఇలాంటి ఆందోళనలో పాల్గొంటున్నవారుగా వున్నారు. ఈ యువతకి ఉపాధి, సంపాదన వుంది. కాని సాధికారత లేదని పాలనలో భాగస్వామ్యం లేదని భావిస్తున్నారు.

ఈ ఎన్నికలు ప్రహసనం వారిలో పెద్ద ఎత్తున అసహనాన్ని కలిగించింది. పుతిన్ తమ ఓటును దొంగిలించారని వారు భావిస్తున్నారు. పాలక పార్టీని అవినీతికరమైన, నిరంకుశాధికారం గల పార్టీగా భావిస్తున్నారు. అంతేకాకుండా మిగిలిన ప్రతిపక్ష పార్టీలు అధికార వర్గంలో మిలాఖత్ అయినట్లు భావిస్తున్నారు.



అందుకే కొత్త పార్టీలు రాకుండా అధికార యంత్రాంగం ఏదో ఒక సాకు చూపి రిజిష్టర్ చెయ్యడం లేదని ఆరోపిస్తున్నారు. అలాగే కొత్త పార్టీలకు తోడ్పాటునిచ్చే వ్యాపారవేత్తలను వేధింపులకు గురి చేస్తున్నారని ప్రకటిస్తున్నారు. మొత్తంమీద ఈ నిరసన కారులకు ఆర్థిక కోణాలకంటే రాజకీయ అంశాలు, హక్కుల అంశాలు ప్రధానమైనవిగా కనిపిస్తున్నాయి. ప్రధాని పుతిన్‌కు దేశానికి స్థిరత్వాన్ని తెచ్చిన వారుగా పేరుంది. కాని దశాబ్దాలపాటు స్థిరత్వం పేరుతో ఏకవ్యక్తి ఆధిపత్యం సాగుతున్నదని ఆరోపిస్తున్నారు.

మొత్తం మీకు దేశంలో కొంత అభివృద్ధి వున్నా అవధులు లేని అవినీతిని అధికార పక్షం పెంచి పోషిస్తుందని భావిస్తున్నారు. చిన్న వ్యాపారులకు అధికారవర్గాలు కావాలని సృష్టించే అవరోధాలు అసంతృప్తికి దారి తీసింది. స్వయంప్రతిపత్తిలేని కోర్టుల మీద విశ్వాసరాహిత్యం – సంపన్నుల కొమ్ము కాస్తున్నాయన్న భావన వ్యాపించింది.

ఎన్నికల ద్వారా ఈ వ్యవస్థని మార్చడానికి అవకాశాలు లేకపోవడం స్వతంత్ర ప్రతిపత్తిగల ఎన్నికల కమీషన్ లేకపోవడం– ఎన్నికలు నిజాయితీగా, నిష్పక్షపాతంగా జరిగే అవకాశాలు లేకపోవడం ఇలా ప్రజలతో పెరుగుతున్న అసంతృప్తికి ఈ ఎన్నికలలో జరిగిన రిగ్గింగులు, ఫలితాల తారుమార్లుతో నిరసన వెల్లువెత్తింది.

దీనికితోడు ప్రస్తుతం ప్రధానిగా వున్న పుతిన్ 2012లో జరిగే ప్రసిడెంట్ ఎన్నికలలో అధ్యక్షుడిగా పోటీ చేయనున్నట్లు చేసిన ప్రకటన ప్రజల్ని మరింత నిరాశకు గురి చేసింది. ఇదే ఎన్నికల తంతు సాగితే తిరిగి పుతిన్ గెలిస్తే ప్రజాస్వామ్య సంస్కరణలు వాయిదా తప్పదని భావిస్తున్నారు. అందుకే ఈ ఎన్నికలు చెల్లవంటూ మీదకి వస్తున్నారు.

ఒక పక్క రష్యా అధ్యక్షుడు ఈ ఎన్నికలలో అక్రమాలు జరిగాయనడాన్ని కొట్టిపారేస్తూనే వీటిపై విచారణ జరిపిస్తానని ప్రకటించారు. ప్రధాని పుతిన్ ఈ ఎన్నికల అక్రమాల గోల అంతా అమెరికా సృష్టిగా కొట్టి పారేస్తున్నారు. కొత్త పార్లమెంటు సమావేశానికి డిసెంబరు 21వ తేదీని ఖరారు చేశారు. మరోపక్క నిరసనకారులు కొన్ని కీలకమైన డిమాండ్లు ప్రభుత్వం ముందు పెట్టారు.

- అక్రమాలు జరిగినందున ఈ ఎన్నికలు రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరపాలి.
- సెంట్రల్ ఎలక్షన్ కమీషన్ అధిపతిని తొలగించాలి.
- ఎన్నికల చట్టాన్ని మార్చాలి. రిజిస్ట్రేషన్ చేసుకునే వీలు అందరికీ కల్పించాలి.
- ఈ నిరసనల సందర్భంగా అరెస్టు చేసిన వారిని విడుదల చెయ్యాలి.

ఈ డిమాండ్స్ నెరవేర్చకపోతే డిసెంబరు 24న భారీ ప్రదర్శనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ డిమాండ్స్‌ను ఆమోదించడమంటే పుతిన్ పెంచి పోషించిన "యాజమాన్య ప్రజాస్వామ్యానికి" చరమగీతం పాడడం. ఇది ఏదో ఒకరోజు జరిగి తీరుతుంది. అది అధికారంలో వున్న రాజకీయ నాయకులు వినూత్నతో ప్రజాస్వామ్య విస్తరణకు వ్యవస్థల్ని రూపొందించడం ద్వారా మార్పువైపు అడుగులు వెయ్యవచ్చు. అలా చెయ్యడానికి ముందుకు రాకపోతే ప్రజలు కింది నుండి ఈ వ్యవస్థను స్తంభింప చెయ్యడం ద్వారా మార్పును తప్పనిసరి చేస్తారు. డిసెంబరు 24 తర్వాత ఈ ఉద్యమం పయనం ఎటో స్పష్టపడుతుంది. ■

# నీటి సరఫరాలో వివక్ష

- నీటి సరఫరాలో వాటర్‌బోర్డు ద్వంద్వ నీటి
- బడాబాబులున్న ప్రాంతాలకు స్వచ్ఛమైన నీరు
- బస్తీవాసులకు, పేదలకు కలుషిత జలాలు

**సంపన్నవర్గాలకు మంచి నీరు బస్తీ వాసులకు కలుషిత జలం ఓయూ శాస్త్రవేత్తల పరిశోధనలో వెల్లడి**

గ్రేటర్ పరిధిలో నీటి సరఫరాలో ప్రాంతాలపై వివక్ష చూపిస్తున్నారు. సంపన్న వర్గాలు నివాసముంటే ప్రాంతాల్లో సరఫరా అవుతున్న నీటికి, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉండే ప్రాంతాల్లో సరఫరా అవుతున్న నీటి నాణ్యతలో తేడాలు స్పష్టంగా కనిపి స్తున్నాయి. నీటి కాలుష్యం అన్నది కేవలం మధ్యతరగతి, సామాన్య ప్రజలు నివసించే ప్రాంతాల్లో కనిపిస్తోంది. కానీ సంపన్న వర్గాలు నివాసముండే ప్రాంతాల్లో మాత్రం కాలుష్యం అసలు ఉండదు. దీనికి కారణం సంపన్న వర్గాలు ఉండే ప్రాంతాల్లోని నీటిసరఫరా, పైప్‌లైన్‌ల నిర్వహణపై చూపించే శ్రద్ధ సాధారణ ప్రజలు నివాసముండే ప్రాంతాల పట్ల చూపించడం లేదు. దీంతో చాలా ప్రాంతాల్లో తాతల నాటి పైప్‌లైన్ వ్యవస్థ, మరికొన్ని చోట్ల శిథిలమైనా వాటికి మరమ్మతులు చేయడంలో అధికారులు చూపిస్తున్న నిర్లక్ష్యం వల్ల కూడా కాలుష్యం ప్రబలుతోంది.

## ఉస్మానియా శాస్త్రవేత్తల సర్వే

నగరంలోని సంపన్నులు నివసించే బంజారాహిల్స్ వంటి ప్రాంతాలలో సరఫరా అవుతున్న తీరును, కూలీ నాలీ చేసుకుని జీవించే బస్తీల ప్రజలు, చిరుద్యోగులు నివసించే కాలనీలకు సరఫరా అవుతున్ననీటి సరఫరా పై ఉస్మానియా యూనివర్సిటీలోని రీజినల్ సెంటర్ ఫర్ అర్బన్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ శాస్త్రవేత్తలు సర్వే నిర్వహించారు. పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజలు నివసించే ప్రాంతాలకు సరఫరా చేసే నీటిలో అత్యధిక కాలుష్య కారకాలు ఉన్నాయని, ఈ నీటిలో కోలీఫార్మ్ బాక్టీరియా ఉత్పత్తి అయి ఈ నీటిని తాగిన వారు అనేక రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాట్లు

| సర్వే చేసిన ప్రాంతాలు | శాంపిళ్లు | బాక్టీరియా కంటామినేష్ | |
|---|---|---|---|
| | | ప్రజెంట్ | శాతం |
| హైసోషియో ఎకనామిక్ కండిషన్స్ (ఎస్ఈసీ) | 10 | 01 | 10 |
| మధ్యస్థ ఎస్ఈసీ ప్రాంతాలు | 15 | 06 | 40 |
| తక్కువ ఎస్ఈసీ ప్రాంతాలు | 25 | 13 | 52 |
| మొత్తం | 50 | 20 | 40 |




### రోగాలు వస్తాయి

గుడిమల్కాపూర్‌లో ఎక్కడ చూసినా మురుగునీటి సమస్య ఉంది. భరించలేని దుర్వాసన వెలువడుతోంది. ఈ పరిస్థితుల్లో స్థానికులు రోగాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికే కలుషిత నీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు కారణంగా దోమలు వృద్ధి చెంది మలేరియా, ఇతరత్రా రోగాలు వచ్చే అవకాశం ఉంది. ఏ మాత్రం ప్రజలకు విషజ్వరాలు సోకినా ఈ సర్కారు,కార్పొరేటర్ బాధ్యత వహించాలి.

సుకన్య,
లోక్‌సత్తా పార్టీ



**రీజినల్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ భూపతిరావు, డాక్టర్ సయీద్ అజీమ్ ఉన్నీసాల** పరిశోధనల్లో వెల్లడైంది. ఈ బృందం నగరంలో నీటి సరఫరాపై నిర్వహించిన పరిశోధనా అంశాలు అంతర్జాతీయ జర్నల్ జర్నల్ ఆఫ్ కెమికల్, బయోలాజికల్ అండ్ ఫిజికల్ సైన్స్ ప్రచురించింది. ఈ బృందం నగరంలో నీటి సరఫరా జరుగుతున్న పది ప్రాంతాలను ఎంచుకుంది. వారి ఆర్థిక స్థితిగతుల ఆధారంగా వాటిని మూడు విభాగాలుగా విభజించింది. సంపన్న కుటుంబాలు నివసించే ప్రాంతాలను హైసోషియో ఎకనామిక్ కండిషన్స్‌గా, ఉద్యోగులు, మధ్య తరగతి ప్రజలు ఉండే ప్రాంతాలను ఇంటర్మీడియెట్ సోషియో ఎకనామిక్ కండిషన్స్‌గా పేద ప్రజలు నివసించే బస్తీలు, కాలనీలనులో సోషియో ఎకనామిక్ కండిషన్స్ అని మూడు భాగాలుగా విభజించారు. హైసోషియో ఎకనామిక్ కండిషన్స్ కింద బంజారాహిల్స్, జూబ్లీ హిల్స్, రాజ్‌భవన్, హైటెక్‌సిటీ, బేగంపేట, డీఆర్‌డీఎల్ ప్రాంతాలు, మధ్యస్థ ఎస్ఈసీకింద దిల్‌సుఖ్‌నగర్, పత్తర్‌గట్టి, ఆబిడ్స్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి ప్రాంతాలు, తక్కువ ఆర్థిక స్థితి కలిగినలో ఎస్ఈసీ కింద భోలక్‌పూర్, తలాబ్‌కట్ట, ఛత్రినాక, మక్తా కృష్ణానగర్, యూసఫ్‌గూడ ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ ప్రాంతాలలో సుమారు 50 నీటి శాంపిళ్లను సేకరించారు. అందులో సంపన్నులు ఉండే ప్రాంతాల నుంచి 10 శాంపిళ్లు, మధ్య తరగతి వారు నివసించే ప్రాంతాల నుంచి 15 నీటి శాంపిళ్లు, పేద ప్రజలు నివసించే బస్తీల నుంచి 25 నీటి శాంపిళ్లను సేకరించి ప్రయోగాలు చేశారు. సంపన్న కుటుంబాలు నివసించే ప్రాంతాల నీటిలో కంటే పేద, మధ్య తరగతి ప్రజలు నివసించే ప్రాంతాలలో నీటి కాలుష్యం అధికంగా ఉందని, ఈ నీటిని తాగడం వల్ల అందులో ఉత్పత్తి అయిన కోలీఫార్మ్ బాక్టీరియా వల్ల ఈ ప్రాంతాలలో నివసించే వారు అనేక కరాల వ్యాధుల బారినపడుతున్నట్లు పరిశోధనల్లో వెల్లడించారు.

**పెరిగిన నీటి కాలుష్యం**

తాగు నీరు కాలుష్యమైతే అందులో అనేక రకాల బాక్టీరియా, వైరస్‌లు చేరి వాటిని తాగితే అనేక రోగాల బారిన పడే ప్రమాదముందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ముఖ్యంగా నీరు తరచూ కలుషితమైతే అందులో సాల్మోనెల్లా, షిజిల్లా, యెర్షినియా, ఎంటిరోకోలిటికా, కాంపిలోబాక్టర్ వంటి బాక్టీరియా, హెపటైటీస్-ఎ, హెపటైటిస్-ఈ, రోటా అనే వైరస్‌లు, ఎంటమీబా హిస్టోలైటికా, గియార్డినా లాంబిల్లా వంటి పరాన్న జీవులు చేరి అనేక రకాలు రోగాలను కలిగిస్తాయి. అయితే హైదరాబాద్ నగరంలోని సరఫరా అవుతున్న నీరు కాలుషితం కావడం వల్ల అందులో కోలీఫార్మ్ బాక్టీరియా అధికంగా ఉత్పత్తి అవుతుందని, ఇది మానవుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని శాస్త్రవేత్తలు తమ పరిశోధనల్లో నిర్ధారించారు. కొన్నేళ్లుగా నగరంలో నీటి సరఫరాపై అధికారులు తగు చర్యలు తీసుకోకపోవడం వల్లనే నీటి కాలుష్యం పెరుగోతోందని తేల్చారు. ముఖ్యంగా సంపన్నులు నివసించే బంజారాహిల్స్, రాజ్‌భవన్ వంటి ప్రాంతాలలో కొత్త నీటి పైపులైన్లు వేసి ఎన్నటికప్పుడు పర్యవేక్షించే అధికారులు పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే భోలక్‌పూర్, ఛత్రినాక వంటి పాతబస్తీలను పట్టించుకోవట్లేదు. కొన్ని ప్రాంతాలలో ఇప్పటికీ ఎన్నో ఏళ్లనాటి పైపులైన్ల ద్వారానే నీటి సరఫరా జరుగుతోందని, దీనికి తోడుగా చాలా ప్రాంతాలలో మంచినీరు, డ్రైనేజీ పైపులైన్లు ఒకదానిపై ఒకటి కానీ, రెండు పక్కపక్కనే గానీ ఉండటం వల్ల వాటిని రంధ్రాలు పడి వాటి ద్వారా వచ్చే నీరు మంచినీటిలో కలిసిపోతోందని, దీని వల్ల నీరు కాలుష్యమవుతోందని పరిశోధనల్లో తేల్చారు. మంచి నీటి సరఫరా కోసం కోట్ల నిధులు ఉన్నా వాటిని సరైన విధంగా ఖర్చుచేయడం లేదని, అందు వల్లనే ఈ సమస్య తీవ్ర రూపం దాలుస్తోందన్నారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించకుంటే సమస్య మరింత తీవ్ర రూపం దాల్చి ప్రజల ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదముందంటున్నారు. ■

# గుంటూరు జిల్లాలో పార్టీ కార్యకలాపాలు

### అంబేద్కర్ ఆశించిన నిజమైన ప్రజాస్వామ్యం నిర్మిద్దాం

అంబేద్కర్ ఆశించిన నిజమైన ప్రజాస్వామ్య వ్యవస్థను భారతదేశంలో నిర్మించాలని, అదే రాజ్యాంగ నిర్మాత డా॥బి.ఆర్. అంబేద్కర్‌కు మనం అందించే నిజమైన నివాళి అని మహిళాసత్తా నాయకురాలు శ్రీమతి కె. దుర్గాదేవి అన్నారు. అంబేద్కర్ సెంటర్‌లో డా॥బి.ఆర్. అంబేద్కర్‌కు పూలమాల వేసిన అనంతరం, అరండల్ పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో జరిగిన అంబేద్కర్ వర్ధంతి సభలో ఆమె మాట్లాడారు. సభకు లోక్‌సత్తా పార్టీ నగర అధ్యక్షులు డా॥శరత్‌బాబు అధ్యక్షత వహించారు. నగర పార్టీ కార్యదర్శి శ్రీ కె.సాంబయ్య, యువసత్తా నాయకులు శ్రీ యం.శ్రీనాథ్‌రెడ్డి, నగర పార్టీ నాయకులు శ్రీ వల్లూరి సదాశివరావు, పార్టీ కోశాధికారి శ్రీ అచ్యుత్ ఇందుశేఖర్, శ్రీ కె.మహికుమార్, శ్రీ రాజు, శ్రీ సత్యనారాయణ, శ్రీ పి.వి.రాఘవయ్య, అధ్యాపకులు శ్రీ యన్. అరవింద్, మహిళాసత్తా నాయకులు శ్రీమతి పద్మారాణి, శ్రీ జె.బి.సురేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### రొంపిచర్లలో లోక్‌సత్తా పార్టీ శాఖ

**నరసరావుపేట, రొంపిచర్లలో :** నర్సరావు పేట నియోజక వర్గంలో రొంపిచర్ల మండలంలో లోక్‌సత్తా పార్టీ గ్రామీణ శాఖ రొంపిచర్లలో 20 మంది సభ్యులతో ఏర్పడింది. ఈ సందర్భంగా 7గురు సభ్యులతో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సరికొండ కృష్ణంరాజు, ముసుకు రత్తయ్య అధ్యక్ష, కార్యదర్శులుగా, వీరవల్లి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా, సరికొండ తిమ్మరాజు కోశాధికారిగా, చక్రవరం రమేష్‌బాబు, సరికొండ పార్థరాజు, రాపర్లకోటేశ్వరరావు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు నియోజక వర్గ పార్టీ ఇన్‌ఛార్జీ ఈదర గోపిచంద్ ప్రకటించారు.

### రోడ్డుప్రమాదాల నివారణకు మానవహక్కుల కమిషన్ కృషిచేయాలి.

**చిలకలూరిపేట :** ప్రపంచ మానవహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదాసు భానుప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిరోజు పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాల ద్వారా ప్రజల ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రభుత్వం, అధికారులు రోడ్డు ప్రమాదాల నివారణా చర్యలు నామమాత్రంగా చేస్తున్నారని, రాష్ట్ర మానవహక్కుల కమీషన్ ఈ విషయంపై దృష్టి సారించి రోడ్డు ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో లోక్‌సత్తా పార్టీ రోడ్డు ప్రమాదాల నివారణకు కొన్ని సూచనలు చేసిందన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రాష్ట్ర స్థాయిలో ఒక ఎక్స్‌పర్ట్ కమిటీని తక్షణమే ఏర్పాటుచేయాలని, డ్రైవింగ్‌లైసెన్సు పొందగోరువారికి తగు పరీక్షలు జరిపి, వారికి ట్రాఫిక్ నియమనిబంధనలను కంప్యూటర్ ద్వారా పవర్‌పాయింట్ వేసి తెలియజేయాలని, జాతీయ రహదారుల వెంట మద్యంషాపులు, బెల్టుషాపులు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## అనంతపురం

### అవినీతి నిర్మూలనకు వ్యతిరేకంగా ర్యాలీ

**గుంతకల్లు అర్బన్:** అవినీతి నిర్మూలనకు వ్యతిరేకంగా గుంతకల్లు పట్టణంలో లోక్‌సత్తా పార్టీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ మాట్లాడుతూ అవినీతిని అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని అన్నారు. నేడు లంచం లేనిదే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగడం లేదన్నారు. ప్రజలకు సేవలందించాల్సిన నాయకులు లంచాలు, దౌర్జన్యం, బెదరింపులు చేసూ్త ప్రజలను భయబ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. కావున ప్రపంచంలోనే అత్యధిక యువత ఉన్న దేశం మనదని, అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ గాంధీచౌక్ నుంచి ఆర్టీసి బస్టాండు వరకు సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, సునీల్, రంగయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# విజయనగరంలో పార్టీ కార్యకలాపాలు

### అవినీతిని చూసి ప్రపంచ దేశాలు సిగ్గుపడుతున్నాయి

**విజయనగరం :** భారతదేశంలో జరుగుతున్న అవినీతి పరిపాలన, మాఫియా రాజకీయాలు చూసి ప్రపంచదేశాల్లోని నేతలంతా ప్రవాసభారతీయులను హేళన చేస్తున్నారని, దేశంలో పెచ్చుమీరుతున్న అవినీతిని అరికట్టేందుకు ప్రజలు ముందుకురావాలని 'పీపుల్స్ ఫర్ లోక్‌సత్తా' అమెరికన్ యూనిట్ అధ్యక్షులు ప్రసన్నమేడా అన్నారు. అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయనగరంలోని టాంక్‌బండ్ రహదారిలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అవినీతి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా అనినీతి తాండవం చేస్తుంటే ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం విచ్చలవిడిగా విలయతాండవం చేస్తోందన్నారు. నేతలంతా రాజకీయాలను వ్యాపారంగా మార్చేశారని, దీనివల్లే రాష్ట్రంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

### అవినీతి పై పోరాడాలి

పోరాటంతోనే అవినీతిని అంతం చేయవచ్చని అమెరికన్ యూనిట్ అధ్యక్షుడు మేడ ప్రసన్న పిలుపునిచ్చారు. అవినీతికి వ్యతిరేకంగా స్పార్క్ కార్యాలయంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గన్న ప్రసన్న మాట్లాడుతూ ప్రజలు చైతన్యవంతులైతే అవినీతిని అంతమొందించవచ్చున్నారు. ప్రజలు పనులు చేయించుకోవడానికి లంచం ఇవ్వకుండా ప్రశ్నించే తత్వాన్ని అలవచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు పి.రామచంద్రరరావు, ఎ.సి.టి.గౌరవ అధ్యక్షుడు పి.నరసింహరావు, ఎస్.ఎస్.ఎస్.ఎస్.వి.ఆర్.ఎం.రాజు, లోక్‌సత్తా ప్రతినిధి కె.దయానంద్, స్పార్క్ అధ్యక్షుడు పి.వి.పద్మనాభం తదితరులు పాల్గన్నారు.

### అన్నదాతకు అండగా... పోరుబాట

అన్నదాతపక్షాన అఖిలపక్షం పోరుబాట పట్టింది. రైతాంగానికి అండగా నిలిచి, రైతులకు న్యాయం జరిగే వరకూ పోరును సాగిస్తామని అఖిలపక్షనేతలు స్పష్టం చేశారు. రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు తెదేపా, సిపిఐ, లోక్‌సత్తా పార్టీలు సంయుక్తంగా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించాయి. జిల్లా అంతటినీ కరువు జిల్లాగా ప్రకటించాలని, వరి, చెరకు పంటలకు మద్దతు ధరలు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు. సీఎం, మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జలయజ్ఞం, మద్దతు ధరలపై ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. కార్యక్రమం అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి వై.నర్సిహారావుకు వినతిపత్రం అందించారు. స్వామినాధన్ కమిటీ సిఫార్సులు అమలుచేయాలని డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ జిల్లా అంతటినీ కరువుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం కరవుతో అల్లాడుతుంటే నేతలు తమ సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్‌గజపతిరాజు, పతివాడ నారాయణస్వామి నాయుడు, పడాల అరుణ, కోళ్ల లలితకుమారి, గుమ్మడి సంధ్యారాణి, డీవీజీ శంకరరావు, కె.వి.నాయుడు, గొట్టాపు వెంకటనాయుడు, ఆర్.పి.భంజ్‌దేవ్, నిమ్మక జయరాజ్, బొబ్బలి చిరంజీవులు, ఐ.వి.పి.రాజు కనకం మురళీమోహన్, సీపీఐ నాయకులు బుగత సూరిబాబు, బుగత అశోక్ పాల్గొన్నారు.




### చెరకు మద్దతు ధర పెంచాలి

**జామి :** చెరకు మద్దతు ధర పెంచాలని డిమాండ్ చేస్తూ టీడీపీ, లోక్‌సత్తా పార్టీలు బీమసింగి చక్కెర కర్మాగారం ఎదుట ఆందోళన చేపట్టాయి. టీడీపీ జిల్లా శాఖ అధ్యక్షుడు ద్వారపురెడ్డి జగదీష్, మాజీమంత్రి పడాల అరుణ, లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీల ఆధ్వర్యంలో ఆయా పార్టీల కార్యకర్తలు, రైతులు కర్మాగారాన్ని ముట్టడించారు. కార్మాగారం ఎదుట ధర్నాకు దిగారు.

# పశ్చిమగోదావరి జిల్లాలో పార్టీ కార్యకలాపాలు

## అవినీతి నిర్మూలనకు యువత ముందుకు రావాలి

**తణుకు :** నిర్మూలనకు విద్యార్థులు, యువత ముందుకు రావాలని లోక్‌సత్తా పార్టీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ వంక వెకటరామదాసు కోరారు. ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా తణుకు నరేంద్ర సెంటర్‌లో అవినీతిని నిర్మూలించాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో మానవహారం చేపట్టారు. అవినీతిని అరికట్టడం ద్వారానే దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా తణుకు శాఖ ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్, గరగ లక్ష్మీబాయి, సీహెచ్ మల్లిక, ఎంఎస్‌కు చైతన్య, కస్తూరి, తణుకు నాగేశ్వరరావు ప్రసాద్, టి. భగవాన్‌రావు, బెల్లంకొండ శ్రీనివాస్, టి.శివశంకర్, హమీర్ హంజాలతో పాటు ఎన్‌వీఎన్‌ఈఎం, ఇండియన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలి లోక్‌సత్తా

**తణుకు :** పట్టణాన్ని నివాస యోగ్యంగా మార్చాలంటే వెంటనే పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించాలని లోక్‌సత్తా రాష్ట్ర కార్యదర్శి బండారు రామ్మోహన్‌రావు డిమాండ్ చేశారు. లోక్‌సత్తా పార్టీ మున్సిపల్ నాయకత్వ శిక్షణలో భాగంగా రెండవ రోజు పట్టణంలోని 8,9,10 వార్డుల్లో సామూహిక మరుగుదొడ్లకు తలుపులు కూడా లేవని, బహిరంగంగా మరుగుదొడ్లను నిర్వహించడం ప్రజలను అవమానించడమే అన్నారు. సరైన నీటి వసతి లేనందున సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయని మున్సిపల్ అధికారుల వైఖరిని విమర్శించారు.

పట్టణంలో మురుగు కాలువల ప్రవాహం సరిగా లేనందున దోమలు పెరిగి డెంగ్యూ చికున్ గున్యా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లేఅవుట్ లేదని, మంచినీటి సదుపాయం కల్పించలేదని స్థానికులు లోక్‌సత్తా నాయకులకు తెలిపారు. పట్టణంలో దోమలు ముసురు కుంటున్నాయని, పారిశుద్ధ్య పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రజల ఆరోగ్యం క్షీణించే దుస్థితి నెలకొని ఉందని, మున్సిపల్ అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# అనంతపురం జిల్లాలో పార్టీ కార్యకలాపాలు

## ఆసుపత్రి సమస్యలపై గాంధీ విగ్రహానికి వినతి

**రాయదుర్గంటౌన్ :** ప్రభుత్వాస్పత్రిలోని సమస్యలను పరిష్కరించాలని 72 గంటల పాటు గాంధీ మార్గంలో నిరవధిక నిరాహార దీక్షచేపట్టిన, ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టిన ప్రభుత్వ తీరులో చలనం లేకపోవడం దారుణమని లోక్‌సత్తా పార్టీ తాలుకా అధ్యక్షుడు బాబు మండిపడ్డారు. ప్రభుత్వాస్పత్రిలోని సమస్యల పరిష్కారించే విధంగా ప్రభుత్వానికి కనువిప్పు కల్గించు మహాత్మా... అంటూ పట్టణంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ముఖ్యంగా గైనకాలజిస్ట్ లేకపోవడంతో కాన్పుల సమయంలో గర్భవతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ కార్యదర్శి అబ్దుల్లా, కార్యకర్తలు రియాజ్, లోకేష్, దాదావలి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రి సమస్యలపై సంతకాల సేకరణ

**రాయదుర్గం :** స్థానిక ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, స్టాఫ్ నర్సులు, మౌలిక వసతుల కొరతను తీర్చాలని డిమాండ్ చేస్తూ లోక్‌సత్తా ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. పాత మున్సిపల్ భవనం ఎదుట లోక్‌సత్తా పార్టీ తాలూకా అధ్యక్షుడు బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ శిబిరానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది.

ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం జరిగింది. సేకరించిన సంతకాల ప్రతులను ముఖ్యమంత్రి, మంత్రులు, వైద్యావిధాన పరిషత్ అధికారుల, జిల్లా కలెక్టర్‌కు పంపుతామని బాబు తెలిపారు.

# జిల్లాల్లో యువసత్తా కార్యకలాపాలు

## అవినీతిపై ప్రజలు చైతన్యం కావాలి

**అనంతపురం :** అవినీతిపై ప్రజల్లో చైతన్యం వచ్చి యువత ఉద్యమాలకు సిద్ధమైనప్పుడు అవినీతి అంతం సాధ్యమవుతుందని యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేలూరు అశోక్ అన్నారు. అవినీతి వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని యువసత్తా ప్రతినిధులు నగరంలో ర్యాలీ నిర్వహించారు. క్లాక్‌టవర్ నుంచి పాతూరు మార్కెట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వరకు ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ దేశంలో ప్రజలు అవినీతిపై ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. జన్‌లోక్‌పాల్ బిల్లును తక్షణం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. లోకాయుక్త వ్యవస్థను రాష్ట్రంలో మరింత బలోపేతం చేయాలన్నారు. అవినీతి వ్యతిరేక చట్టాన్నింటినీ కఠినతరం చేయాలన్నారు. యువసత్తా ప్రతినిధులు చంద్రశేఖర్ షేక్‌యుసఫ్, తుమ్మల అమర్‌నాథ్, వెంకటనాయుడు, హరిగోపాల్, మారుతిప్రసాద్, సుబ్బయ్య, సురేష్, అనిల్, సోమనాథ, శ్రీధర్, దివాకర్, సుదర్శన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి వ్యతిరేక దినోత్సవం - యువసత్తా

**శ్రీకాకుళం :** అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం పట్టణంలో లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో యువసత్తా భారీ అవినీతి వ్యతిరేక ర్యాలీని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి డే&నైట్ జంక్షన్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కె. వెంకట్రావు (రిటైర్డ్ సూపరిండెంట్ ఆఫ్ పోస్టాఫీస్) జెండావూపి ర్యాలీ ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులు కె. పోలినాయుడు, యువసత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు పంచాది రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో దేశంలో అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని నిర్మించడంలో లోక్‌సత్తా పార్టీ విశేషకృషి చేసిందన్నారు. బలమైన మూడంచెల లోక్‌పాల్‌తో అవినీతిని కట్టడి చేయవచ్చునని, అందుకోసం యువత ప్రభుత్వంపై ఒత్తి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిటిజన్ ఫోరం అధ్యక్షులు బి. కామేశ్వరరావు, కె.ఎల్. నాయుడు, వి. అప్పలరాజు, యువసత్తా సభ్యులు బి. వెకుంఠరావు, యస్. మోహనరావు, కె. ప్రవీణ్, పి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అంతానికి మూండచెల విధానం

**విశాఖపట్నం, డాబాగార్డెన్స్ :** అవినీతి అంతానికి దేశంలో తప్పనిసరిగా మూడంచెల విధానాన్ని అమల్లోకి తేవాలని యువసత్తా ప్రతినిధులు, డిమాండ్ చేశారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో సాయంత్రం జీవిఎంసీ గాంధీ విగ్రహం వద్ద అవినీతికి వ్యతిరేకంగా యువకులు, విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. యువసత్తా రాష్ట్ర అధ్యక్షుడు శివాజీ రాజు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. దేశంలో లోక్‌పాల్, రాష్ట్రంలో లోకాయుక్త, జిల్లాల్లో అంబుడ్స్‌మన్ విధానాలను తప్పనిసరిగా అమల్లోకి తెవాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల రచ్చబండలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డే స్వయంగా ఏటా రూ॥2వేల కోట్ల అవినీతి జరుగుతున్నట్లు ప్రకటించారంటే తప్పని సరిగా మూడంచెల విధానం ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో దీనికి సంబంధించిన బిల్లును ప్రవేశపెట్టాలని కోరారు. కార్యక్రమంలో యువసత్తా నాయకులు సురేష్ కుమార్, శ్రీనివాస్, ప్రసాద్, చైతన్య అజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతికి వ్యతిరేకంగా లోక్‌సత్తా సంతకాల సేకరణ

**ఒంగోలు టౌన్ :** అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఎదుట ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు అల్లు శివరమేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో అవినీతి పెచ్చుమీరుతోందని, అవినీతికి వ్యతిరేకంగా లోక్‌సత్తా పోరాడుతోందని తెలిపారు. లోక్‌పాల్ చట్టాన్ని రాష్ట్రాలకు వర్తించే విధంగా రూపొందించాలని, దీనిపై ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి ప్రజల సంతకాలతో కూడిన వినతి పత్రాలను అందజేస్తామని చెప్పారు. అవినీతి వ్యతిరేక బిల్లును 2009లో అసెంబ్లీలో డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ ప్రవేశపెట్టినప్పటికీ బిల్లు ఆమోదించకపోవడం అవినీతి నిర్మూలనపై రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధ లేదనే విషయం తేటతెల్లం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ రఫి, వరికోటి రాము, చిరంజీవిరెడ్డి, ఎలిజబెత్, యువసత్తా కార్యకర్తలు పాల్గొన్నారు.

# అవినీతికి వ్యతిరేకంగా



విశాఖపట్టణంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన రాష్ట్ర యువసత్తా అధ్యక్షుడు పి. శివాజీరాజు



ఒంగోలులో యువసత్తా, లోక్‌సత్తా ఆధ్వర్యంలో లోక్‌పాల్, లోకాయుక్తలకు మద్దతుగా సంతకాల సేకరణ



శ్రీకాకుళం జిల్లాలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



రంగారెడ్డి జిల్లా, మేడ్చల్‌లో యువసత్తా ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



అనంతపురం జిల్లాలో యువసత్తా ఆధ్వర్యంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



అనంతపురం జిల్లా, గుంతకల్లు పట్టణంలో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



పశ్చిమగోదావరి జిల్లా, తణుకులో అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ ర్యాలీ



విజయనగరంలో డిసెంబరు 9న అవినీతి వ్యతిరేకంగా ఒక్కరోజు నిరాహార దీక్ష

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2010-12













డిశంబరు 16న ఖమ్మంలో అవినీతి వ్యతిరేక ఉద్యమంలో యువత అనే అంశంపై ప్రసంగిస్తున్న డా॥ జేపీ
విద్యార్థులతో ర్యాలీ, బహిరంగ సభ దృశ్యాలు

To,

**Book-Post**
PRINTED MATTER

If not delivered please return to:

Lok Satta Times
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad